


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 13-06-2020 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 239 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పులివెందుల అభివృద్ధిపై సీఎం జగన్ సమీక్ష

- పులివెందులలోని మెయిన్‌రోడ్‌లో మార్పు చేయడానికి ప్రాధాన్యత
- నగరంలో మంచినీరు, డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ సదుపాయాలు కల్పించాలి



అమరావతి : పులివెందుల ఏరియా డెవలప్మెంట్ ఏజెన్సీ (పాడా)పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. పులివెందుల మోడల్ టౌన్‌ను నాలుగు రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని అధికారులు వివరించారు. 2053 వరకు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికను రూపొందించామని తెలిపారు. నగరంలో మంచినీరు, డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ తదితర సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పాడా పరిధిలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ నమూనాలను అధికారులకు సీఎం జగన్‌కు వివరించారు. అభివృద్ధిలో పులివెందులను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వసతులను కూడా కల్పించి ఆధునీకరిస్తున్నామని సీఎంతో చెప్పారు. వీధి వ్యాపారులకు రెండు, మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమీక్షా సమావేశంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాడా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం నిర్మించే భవనాలు ఏళ్ళు గడుస్తున్నా కొద్దీ మరింత అందంగా కనిపించేలా నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. అలాగే ఉలిమెల చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కింద అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

మంచినీటి శుద్ధి ప్లాంట్ను కూడా అనుబంధంగా ఏర్పాటు చేయాలన్నారు. చెరువు నుంచి పాడా పరిధిలో ప్రజలకు మంచినీటిని అందించే విధంగా ప్రణాళిలకు రూపొందించాలని పేర్కొన్నారు. పులివెందులలోని మెయిన్ రోడ్‌లో మార్పు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. శుక్రవారం జరిగిన ఈ సమీక్ష రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖామంత్రి బొత్స సత్యనారాయణ, కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

- బోర్డు వెబ్‌సైట్‌తో పాటు ఇతర వెబ్‌సైట్లలో ఫలితాలు
- ఈనెల 15 నుంచి మార్కుల మెమోలు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం
- బాలికలదే పైచేయి..




అమరావతి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విజయవాడలో సాయంత్రం 4 గంటలకు ఫలితాలు విడుదల చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ... అన్ని సవాళ్లను అధిగమించి దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ప్రప్రథమంగా ఫలితాలను మనం విడుదల చేశాం. కరోనా సంక్షోభ సమయంలోనూ ఫలితాలను అనుకున్న సమయానికి విడుదల చేయడమనేది ఇది ఓ చరిత్రాత్మకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకంలో విద్యాశాఖలోని అందరూ అధికారుల సమిష్టి కృషితో ఫలితాలను విడుదల చేశాం. లాక్‌డౌన్ ఉన్నప్పటికీ నెలరోజుల పాటు వాల్యూయేషన్ పూర్తి చేశాం. ఈ ఏడాది విద్యా వ్యవస్థలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టాం. రానున్న రోజుల్లో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అందరికీ ఆదర్శంగా నిలవనుంది.' అని తెలిపారు.

**ఈసారి కూడా బాలికలదే పైచేయి**

ఇంటర్ ఫలితాలకు వస్తే... మొదటి సంవత్సరంలో 59శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో 63 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈసారి కూడా ఉత్తీర్ణతలో బాలురు కన్నా బాలికలే పైచేయిగా నిలిచారు.

జిల్లాలువారీగా చూస్తే ఫలితాల్లో కృష్ణాజిల్లా మొదటి నిలిచింది. ఫలితాలకుం తరువాయి 2లో..

## కిడ్నాప్ చేయాల్సిన అవసరం మాకు లేదు

- అసెంబ్లీలో చర్చ పెట్టమని అడగాలి..
- మంత్రి బొత్స సత్యనారాయణ



తాడేపల్లి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ధైర్యం ఉంటే అసెంబ్లీలో అచ్చెన్నాయుడు అవినీతిపై చర్చ పెట్టమని అడగాలని పురపాలకశాఖా మంత్రి మంత్రి బొత్స సత్యనారా యణ సవాల్ విసిరారు. అచ్చెన్నాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారని అంటున్నారే తప్ప.. అవినీతి జరగలేదని చంద్రబాబు గానీ టీడీపీ నేతలు ఎక్కడా చెప్పడం లేదని ఎద్దేవా తరువాయి 2లో..

## 18 నుంచి 9 శాతానికి తగ్గిన జీఎస్టీ



హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా.. ఇవాళ జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి సీతారామన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సెప్టెంబర్ 30 వరకు జీఎస్టీ రిటర్న్ దాఖలుకు రుసుము వసూల్ చేయకూడదని నిర్ణయించారు. 5 కోట్ల టర్నోవర్ ఉన్న వ్యాపారులకు ఊరట కల్పించారు. జీఎస్టీ శాతాన్ని 18 నుంచి 9 శాతానికి తగ్గించారు. చిన్న వ్యాపారుల కోసం కీలక సంస్కరణలను తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. జూలైలో మరోసారి జీఎస్టీ మండలి భేటీ జరగనున్నది.

అప్పుడు నష్టపరిహారం పన్ను గురించి చర్చించనున్నారు. ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలి అన్న అంశాన్ని చర్చించనున్నారు.

## అవినీతికి పాల్పడితే అరెస్టు చేయొద్దా?:

### ఏపీ హెూం మంత్రి మేకతోటి సుచరిత



అమరావతి: టీడీఎల్పీ ఉపనేత, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అరెస్టుపై ఏపీ హెూం మంత్రి మేకతోటి సుచరిత స్పందించారు. ఈఎస్ఐ మందుల కొనుగోళ్ల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినందునే ఏసీబీ అధికారులు అచ్చెన్నాయుడిని అరెస్టు చేశారని వెల్లడించారు. వైద్య పరికరాల కొనుగోళ్లలోనూ అవినీతి జరిగిందని పేర్కొన్నారు. అచ్చెన్నాయుడు తరువాయి 2లో..

## ఏపీలో మరో 141 పాజిటివ్ కేసులు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల్లో 11,775 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, 141 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. కరోనాతో కోలుకొని 59 మంది డిశ్చార్జి అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది.

రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,402 కేసులు నమోదవ్వగా, 80 మంది కరోనాతో పోరాడి మృత్యువాత పడ్డారు. మొత్తం 2,599 మంది వైరస్ నుంచి కోలుకొని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. రాష్ట్రలో ప్రస్తుతం 1723 యాక్టివ్ కేసులు ఉన్నాయి




## మాజీ మంత్రి అచ్చెన్నాయుడు అరెస్టు

- భగ్గుమన్న తెలుగుదేశం పార్టీ నాయకులు
- టీడీపీ హయాంలో ఈఎస్ఐలో 150 కోట్ల రూపాయిల వరకూ అవినీతి జరిగినట్లు ఆరోపణలు
- అప్పటి మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు మరొకొందరి పాత్ర ఉందని దర్యాప్తులో తేల్చిన ఏసీబీ
- అచ్చెన్నాయుడు సహా 6గురి అరెస్ట్



శ్రీకాకుళం: మాజీ మంత్రి, టీడీఎల్పీ ఉప నేత, టెక్కలి ఎమ్మెల్యే కింజరావు అచ్చెన్నాయుడిని అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. తేదేపా ప్రభుత్వం హయంలో ఈఎస్ఐ మందుల కొనుగోళ్లకు సంబంధించిన ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో ఈరోజు ఉదయం 7.20 గంటలకు శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తననివాసంలో ఉండగా అచ్చెన్నాయుడిని ఏసీబీ అదుపులోకి తీసుకుంది. అచ్చెన్నాయుడితో పాటు మరికొంతమందిని కూడా అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఐదు నిమిషాల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసిన ఏసీబీ ప్రత్యేక బృందాలు అచ్చెన్నాయుడిని అదుపులోకి తీసుకుంటున్న సమయంలో గన్‌మెన్‌ను తరువాయి 2లో..

## అచ్చెన్న అరెస్టుపై న్యాయపోరాటం

### శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు




శ్రీకాకుళం : టీడీఎల్పీ ఉపనేత, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేశారని శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏశాఖలోనైనా అవినీతి జరిగితే నిబంధనల ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకున్న తర్వాతే చర్యలుంటాయి. కానీ, ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే అచ్చెన్నాయుడిని అరెస్టు చేశారని రామ్మోహన్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తరువాయి 2లో..

# పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ



భీమునిపట్నం : పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం నాయకులు నమ్మి లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో 12 మంది పారిశుద్ధ్య కార్మికుల కి బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అందరికి పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు బి. కాంతారావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో జగన్ మోహన్ రెడ్డి పథకాలని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అవంతి శ్రీనివాసరావు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జోగారావు మరియు వార్డ్ వాలంటీర్లు, వార్డ్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# 16న దేశవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయండి



కొయ్యూరు : సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జూన్ 16న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనలో భాగంగా శుక్రవారం కొయ్యూరు మండలం డౌనూరు సంతలో పోస్టల్ ఆవిష్కరణ, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు మాట్లాడుతూ జూన్ 16వ తేదీన మండల కేంద్రంలో ఆందోళనకు ప్రజలు వచ్చి మద్దతు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి 7500 ఇవ్వాలని, ఆరు నెలల పాటు సాయం చేయాలని కోరారు. ప్రతీ మనిషికి 10 కేజీల బియ్యం ఆరు నెలల వరకు ఇవ్వాలన్నారు. 200 రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు 600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాల రద్దు ఆపాలన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

అన్ని పిహెచ్‌సిల్లో కరోనా టెస్టులు చేయాలని, విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.శంకర్, శాఖ కార్యదర్శులు పి.బంజన్న, కె.చిట్టిబాబు, మర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల రహితంగా వార్డును నిలుపుతాం

***- శివాజీపాలెంలో పీతల గోవింద్ పర్యటన***

***- యూజీడీ సమస్యలపై తమ గోడు వెళ్లబోసిన స్థానికులు***



విశాఖపట్నం :సమస్యల రహితంగా తమ వార్డును నిలుపుతామని వైఎస్ఆర్‌సీపీ 22వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి పీతల గోవింద్ అన్నారు. ఆయన శివాజిపాలెంలో పలు ప్రాంతాలను సందర్శించారు.

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో తరచూ యూజీడీ సమస్యలు ఎదురవుతున్నాయని, మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, యూజీడీ మురుగు ఇళ్లలో మంచినీటి సంపుల్లోకి చేరుతోందని పీతల గోవింద్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వార్డు సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. సత్వరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞాప్తి చేశారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, తనవంతు సహాయాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు.

కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఖాదర్ బాబా, వియ్యపు అప్పారావు, స్థానికులు దువ్వి గోవింద్, దువ్వి రాజు, చందక రవణ, చంద్రాన శశికాంత్,టి.రవి శంకర్, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



కంచరపాలెం : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాలల హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయని గ్రీన్ గార్డెన్స్ సచివాలయ సిబ్బంది పెర్కొన్నారు .ఈమేరకు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 53 వ వార్డు పరిది మర్రిపాలెం , గ్రీన్ గార్డెన్స్ తదితర ప్రాంతల్లో శుక్రవారం ఉదయం సచివాలయ సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సచివాలయం మహిళా పోలీస్ ఆర్ .భవానీ మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న దాడులు, వేధింపులను ఖండిచాల్సిన బా ధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల కార్మికుల ను ఎవరైనా హెూటళ్లు, ఇటుక బట్టీల్లో, పరిశ్రమ ల్లో పని చేయిస్తే టోల్‌ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. కరోనాతో ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థులకు సృజనాత్మక శక్తి పెం పునకు చిత్రలేఖనం, ఉపన్యాస, కవిత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో బాగంగా బాల కార్మిక చట్టాలపై అవగహన కల్పించడంతో పాటుగా ప్లకార్డు తో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఎ .ఎన్ .ఎం అనితా, వాలంట రీలు పాల్గున్నారు.

## అప్పన్న అన్నప్రసాదం, కేశఖండనశాలకు ట్రైల్ రన్ నిర్వహించిన అధికారులు



సింహాచలం : సింహాద్రి నాథుని దర్శనానికి విచ్చేయు భక్తులు మరింత సేవలు అందుబాటులోకి తెచ్చే దిశగా కోవిడ్19 నిబంధనలు సూచనలు పాటిస్తూ భక్తులకు స్వామివారి అన్న ప్రసాదాన్ని కదంబం ను 500 గ్రాముల 100 ప్యాకెట్లు రూపంలో సిద్ధంచేసి ఈ ఓ బ్రమరాంబ చేతులు మీదుగా భక్తులకు పంచిపెట్టారు అలాగే స్వామి వారికి భక్తులు సమర్పించే తలనీలాలు కేశఖండన శాలను శుక్రవారం నాడు కొద్ది మంది భక్తులకు అనుమతించి ట్రైల్ రన్ నిర్వహించారు ట్రైల్ రన్ లో భాగంగా ప్రత్యేక శానిటేషన్ రక్షణ చర్యలు చేపట్టి భక్తులను అనుమతించారు. రెండు రోజుల పాటు ఈ ట్రైల్ రన్ నిర్వహించి భక్తులకు 15 వ తేదీ నుంచి భక్తులకు అందుబాటులోకి తేనున్నారు. అన్న ప్రసాదం ట్రైల్ రన్ లో ఈ ఓ తో పాటుగా దేవస్థానం సిబ్బంది మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



## *కక్షపూరితంగా అరెస్టు చేశారు: కళా వెంకట్రావు*

అమరావతి: టీడీఎల్పీ ఉప నేత, మాజీ మంత్రి అచ్చెన్నాయుడిని శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేయడాన్ని తెదేపా నేతలు తీవ్రంగా ఖండించారు. బీసీ నాయకుడిని కక్షపూరితంగా అరెస్టు చేశారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో సమస్యలపై ఏ రాజకీయ పార్టీ అయినా పోరాడుతుంది, ప్రశ్నిస్తుంది .. కానీ, ప్రతిపక్ష నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం తగదన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న కక్షపూరిత రాజకీయాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరముందన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మాజీ మంత్రి అచ్చెన్నాయుడు అరెస్టు

కూడా అనుమతించలేదు. అచ్చెన్నాయుడిని విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు సమాచారం. తెదేపా ప్రభుత్వంలో అచ్చెన్నాయుడు కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. ఈఎస్ఐ ఆసుపత్రులకు సంబంధించి మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైకాపా ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. ఈఎస్ఐలో అవినీతి జరిగినట్లు విజిలెన్స్ దర్యాప్తులో తేలింది. నకిలీ కొటేషన్లతో ఆర్డర్లు ఇచ్చినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ కమిటీ నివేదిక ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

**'200 మంది గోడదూకి వచ్చారు' అచ్చెన్న అరెస్టుపై కుటుంబ సభ్యుల ఆందోళన**

టీడీఎల్పీ ఉప నేత, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిని శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అరెస్టు సందర్భంగా ఏసీబీ అధికారులు, పోలీసులు వ్యవహరించిన తీరుపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిమ్మాడలోని తమ నివాసంలోకి 200 నుంచి 300 మంది గోడదూకి చొరబడ్డారని ఆరోపించారు. కనీసం మందులు వేసుకునేందుకు కూడా సమయం ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడి అరెస్టు అనంతరం ఆయన సతీమణి విజయమాధవి మీడియాతో మాట్లాడుతూ...''ఉదయం 7.20 గంటలకు అచ్చెన్నాయుడిని తీసుకెళ్లారు. అంతకు.. అరగంట ముందు ఆయన నిద్ర లేచి స్నానం చేసి కూర్చున్నారు. ఇంతలోనే కొందరు వచ్చి క్షణాల్లోనే అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. నిన్ననే చిన్న సర్జరీ జరిగింది. వైద్యుల సూచన మేరకు ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. మందులు వేసుకోవాలి.. ఆరోగ్యం బాగోలేదు అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు'' అని ఆమె వివరించారు. 200 మంది గోడ దూకి వచ్చి అచ్చెన్నాయుడిని తీసుకెళ్లారని ఆయన సోదరుడు హరి వరప్రసాద్ తెలిపారు. అరెస్టుకు సంబంధించి తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని చెప్పారు.

# అచ్చెన్న అరెస్టుపై న్యాయపోరాటం

న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. '' ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించకూడదా? ప్రజల మద్దతున్న నాయకుడిపై కక్ష సాధిస్తున్నారు. నవరత్నాలు అంటూ ప్రజలకు ఇష్టమొచ్చినట్టు హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటన్నా సక్రమంగా అమలు చేశారా? ఏడాది పాటు ఫ్యాక్షన్ రాజకీయాలు తప్ప చేసిందేమీ లేదు. మా కుటుంబం మొత్తం నీతికి, నిజాయితీకి కట్టుబడి సేవలందింస్తోంది. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా.. అసలు నిజమేంటో బయటికొస్తుంది. ఎన్నో పథకాలను తెదేపా ప్రారంభించిందనే కారణంతో ఆపేశారు. ప్రతిపక్షమే లేకుండా చేయాలని ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ఎల్జీ పాలీమర్స్ ఘటన జరిగితే స్థానికులను రోడ్లపై పడేశారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని నిలబడింది. తెదేపా అధినేత చంద్రబాబు సహకారంతో వైకాపా అరాచకాలను ఎదుర్కొంటాం'' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## అవినీతికి పాల్పడితే అరెస్టు చేయొద్దా?:

అరెస్టు విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవద్దా? అని హెూం మంత్రి ప్రశ్నించారు. ఈఎస్ఐ వ్యవహారంలో తెదేపా నేత అచ్చెన్నాయుడిని ఇవాళ ఉదయం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సాయంత్రం 4గంటలకు విజయవాడలో ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

# ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

స్థానంలో సంబంధించి టోల్‌ఫ్రీ నెంబర్‌ను విద్యాశాఖ ఏర్పాటు చేసింది.ఫలితాలు https://bie.ap.gov.in, www.sakshieducation.com తదితర వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి. బోర్డు వెబ్‌సైట్లో హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా ఫలితాలు పొందవచ్చు. ఇంటర్ మొదటి సంవత్సరం 5,07,228 మంది, రెండో సంవత్సరం 4,88,795 మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం 39,139 మంది, రెండో సంవత్సరం 29,993 మంది మొత్తం 10,65,155 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇంటర్‌లో గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసినందున మొదటి సంవత్సరం ఫలితాల్లో సబ్జెక్టుల వారీగా మార్కులు, రెండో సంవత్సరం ఫలితాలు సబ్జెక్టుల వారీగా గ్రేడ్ పాయింట్లలో ప్రకటించనున్నారు. ఇక ఫలితాల షార్ట్ మార్కుల మెమోలు ఈనెల 15వ తేదీ నుంచి విద్యార్థులకు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయి. వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లాక్‌డౌన్ సడలింపుల తర్వాత పరీక్ష ఫలితాలు వెల్లడించిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం విశేషం.

**ఫలితాల్లో జిల్లాల వారీగా స్థానాలు...**

ఇంటర్ మొదటి సంవత్సరం
మొదటి స్థానం: కృష్ణా జిల్లా (75 శాతం)
రెండో స్థానం: పశ్చిమ గోదావరి, గుంటూరు (65 శాతం)
మూడో స్థానం: విశాఖపట్నం (63 శాతం)
ఇంటర్ రెండో సంవత్సరం
మొదటి స్థానం: కృష్ణా జిల్లా
రెండో స్థానం: పశ్చిమ గోదావరి (71 శాతం)
మూడో స్థానం: నెల్లూరు, విశాఖపట్నం (68 శాతం)

# కిడ్నాప్ చేయాల్సిన అవసరం మాకు లేదు

చేశారు. చంద్రబాబు మాటలు నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదని.. పక్కా ఆధారాలతో ఏసీబీ అచ్చెన్నాయుడును అరెస్ట్ చేసిందని స్పష్టం చేశారు. తనపై చంద్రబాబు గతంలో లేనిపోని ఆరోపణలు చేశారని ఆ సమయంలో తాను సీబీఐ విచారణను స్వాగతించానని గుర్తు చేశారు. ''నేను ఏ తప్పూ చేయలేదు కాబట్టి ధైర్యంగా ఉన్నా. అయినా.. నాపై మీ పత్రికల్లో ఇష్టానుసారంగా వార్తలు రాయించలేదా. నేను కూడా వెనుకబడిన కులానికి చెందిన వాడినే. నేను బీసీ అని అప్పుడు మీకు గుర్తురాలేదా''అని చంద్రబాబును ప్రశ్నించారు. అవినీతికి కులాలు అపాదించడం తగదని హితవు పలికారు. ''ఈఎస్ఐలో రూ. 150 కోట్లు అవినీతి జరిగిందని ఏసీబీ అధికారులు తేల్చారు. అచ్చెన్నాయుడు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. టెండర్లు పిలవకుండా ఆయన ఇష్టానుసారంగా తమకు నచ్చిన వారికి కట్టబెట్టారు. నామినేషన్ మీద పనులు ఇవ్వాలని లేఖ రాశారు. 134 శాతం అధిక ధరలకు మందులు ఇతర సామగ్రి కొనుగోలు చేశారు.

ఈ నేపథ్యంలో అచ్చెన్నాయుడు అవినీతికి పాల్పడ్డారని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ అంటే ఎవరికి తెలియకుండా ఎత్తుకు పోవడం. కిడ్నాప్ చేయాల్సిన అవసరం మాకు లేదు. టీడీపీ నేతలే మా అవినీతిపై విచారణ జరపాలని సవాల్ చేశారు. ఇప్పుడేమో ఇలా మాట్లాడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో చంద్రబాబు అవినీతిపై విచారణ జరువుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. మేము అవినీతి రహిత పాలన అందిస్తామని ప్రజలకు చెప్పాం.

వాళ్లు మాకు అవకాశం ఇచ్చారు. టీడీపీ హయాంలో జరిగిన స్కాంలు రోజుకొకటి బయటకు వస్తాయి. చంద్రబాబు హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టు కేటాయింపు వ్యవహారంపై సమీక్ష చేసి 500 ఎకరాల భూమి వెనక్కి తీసుకున్నాము. తద్వారా ప్రభుత్వానికి రూ. 1500 కోట్ల ఆదా అయింది'' అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదు



శ్రీకాకుళం: ఈఎస్ఐ స్కాంలో టీడీపీ ఎమ్మెల్యే కింజరపు అచ్చెన్నాయుడును అరెస్ట్ చేస్తే కిడ్నాప్ అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు వక్రీకరిస్తున్నారని రాష్ట్ర రహదారులు,భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేరం జరిగినప్పుడు అరెస్ట్ సర్వసాధారణం అన్నారు. చంద్రబాబు,లోకేష్ వ్యాఖ్యలు దురదృష్టకరమని, తప్పు చేసిన వ్యక్తిని వదిలేసి బీసీలకు ఆపాదిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో బీసీ ఓట్లతో గెలిచిన చంద్రబాబు.. వారిని గాలికొదిలేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. తప్పు ఎవరు చేసినా శిక్ష తప్పదని మంత్రి కృష్ణదాస్ స్పష్టం చేశారు

# మత్స్యరంగం విశిష్టతను గుర్తించి ఈ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం

**రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మరియు జిల్లా ఇన్ చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ**



కాకినాడ : మత్స్య శాఖకి సంబంధించి జిల్లాలో కాకినాడ స్మార్టు సిటీ నిధుల నుండి రూ. ఒక కోటి 90లక్షలతో మత్స్య శాఖ పరిపాలన కార్యాలయ భవనాన్ని నిర్మించడం జరుగుతుందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మరియు జిల్లా ఇన్ చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం కాకినాడ జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏటిమొగ బోట్ బిల్డింగ్ యాడ్ వద్ద నిర్మించనున్న మత్స్యశాఖ పరిపాలన భవన శంఖుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖామంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మరియు జిల్లా ఇన్ చార్జి మంత్రి మోపిదేవి వెంకటరమణ, అమలాపురం పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ, రాష్ట్ర మత్స్యశాఖ కమీషనర్ కె.కన్నబాబు, స్థానిక ఎమ్ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డిలు ముఖ్య అతిదులుగా పాల్గొని, భవన శంఖుస్థాపన శిలాపలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మత్స్యరంగం విశిష్టతను గుర్తించి ఈ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా నుండి తూర్పుగోదావరి జిల్లా వరకు పొడవైన సముద్ర తీర రేఖ ఉండడంతో ఈ ప్రాంత్రం మత్స్య రంగానికి అధిక ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మత్స్యకారుల యొక్క ఆర్థిక స్థితిగతులు గుర్తించి ఇటివలే మత్స్యకార భరోసా ద్వారా ప్రతి మత్స్యకారునికి 10వేల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని మంత్రి తెలిపారు. అదే విధంగా డిజిల్ సబ్సిడి కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విధంగా ముఖ్యమంత్రి మత్సరంగానికి అధిక ప్రాముఖ్యత ఇవ్వడంతోపాటు పరిపాలనకు అవసరమైన భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టడం జరిగిం దన్నారు. దీనిలోని భాగంగా జిల్లాకు సంబంధించి కాకినాడ స్మార్టు సిటీ నిధుల నుండి

రూ. ఒక కోటి 90లక్షలతో మత్స్య శాఖ పరిపాలన కార్యాలయ భవనాన్ని నిర్మించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ భవనంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, అదనపు డైరెక్టర్, కాకినాడ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి, కాకినాడ అసిస్టెంట్ ఇన్ స్పెక్టర్లకు సంబంధించిన కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## మంత్రి జన్మదినం సందర్భంగా హాసిని వర్మ సేవా కార్యక్రమాలు



భీమునిపట్నం : రాష్ట్ర పర్యాటక మరియు యువజన సర్వీసులు శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని హాసిని వర్మ పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తగరపువలస లోని వంద మంది పేదలకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు, రెండు పేద కుటుంబాలకు నిత్యావసరాలను అందజేశారు. అదేవిధంగా నేరేళ్లవలస లో గల వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఈ రోజు మూడు పూటలా భోజనం ఏర్పాటు చేయడంతో పాటు వారికి చీరలు, రొట్టె మరియు పళ్ళు కూడా ఏర్పాటు చేశారు. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గం అభివృద్ధి లో దూసుకెళ్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు కూడా కుల మతాలకు మరియు రాజకీయాలకు అతీతంగా అందుతున్నాయని హాసిని వర్మ తెలియజేశారు. మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని, ఆయన ఎప్పటికీ ఇలాగే పేద ప్రజలకు తన సేవలు విస్తృతంగా అందించాలని ఆయన అభిలషించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార యువజన సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీ రాం ( జానీ), హాసిని ఎస్టేట్స్ అండ్ కనస్ట్రక్షన్స్ డైరెక్టర్లు బి.కె.మూర్తి, సూర్య శ్రీనివాస్, శివరాజు, వి కేర్ యూ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధుల పై అవగాహన ర్యాలీ

భీమునిపట్నం : స్థానిక గొల్ల వీధిలో భీమిలీ జోనల్ కమిషనర్ సిహెచ్ గోవిందరావు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వర్షా కాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రభల కుండా ఉండేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలీ జోన్ సానిటరీ ఇన్ స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అరెస్ట్ అక్రమం : - మాజీ ఎమ్మెల్యే పల్లా

**-మిన్నంటిన తేదేపా నిరసన జ్వాలలు -తెదేపా మాజీ ఎమ్మెల్యే పల్లా అరెస్ట్.... విడుదల..**



అదుపులోకి తీసుకుంటున్న దృశ్యం

గాజువాక: మాజీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి,తేదేపా ఉపనేత కింజరాపు అచ్చెం న్నాయుడును ఇ ఎస్ ఐ మందులు పంపిణీ లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో శుక్రవారం శ్రీకాకుళంలో ఏసీబీ అరెస్ట్ చేశారు. దీనికి నిరసనగా గాజువాక ప్రధాన కూడలి వద్ద తేదేపా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు నిరసన, ధర్నా కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం తేదేపా ను టార్గెట్ చేస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారంటూ, ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్ష్యసాధింపు చర్యలు మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తేదేపా మచ్చలేని పాలనను అందించిందని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి చేసిన మేలు ప్రజలకు తెలుసని, అయినా తెదేపా మాజీ మంత్రులను, మాజీ ఎమ్మెల్యే లను,నాయకులను ఎదో విదంగా అక్రమ కేసులలో ఇరికించి లబ్ది పొందాలని పథకం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు హేయమైనవి అని అన్నారు. ఇదిలావుంటే విషయం తెలుసుకున్న గాజువాక శాంతి భద్రతల విభాగం సిఐ సూరినాయుడు ఏసీపి ఆదేశాల మేరకు నిరసన కారులను అదుపులోకి తీసుకుని గాజువాక స్టేషన్ కు తరలించారు. అనంతరం పూచీకత్తు పై విడుదల చేసినట్లు సి. ఐ. సూరినాయుడు తెలిపారు. అరెస్టైన వారిలో మాజీ తేదేపా కార్పొరేటర్లు రఫీ,పల్లా శ్రీనివాసరావు, ప్రసాదుల శ్రీనివాసరావు, గోమాడ వాసు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అరుంధతి, వశిష్ఠ పథకాల ద్వారా 100 మంది లబ్ధిదారులకు 50 లక్షలు రుణాలు మంజూరు

విశాఖపట్నం : స్థానిక ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ నుండి అరుంధతి, వశిష్ఠ పథకాల ద్వారా 100 మంది లబ్దిదారులకు 50 లక్షలు రుణాలు మంజూరు చేసినట్లు సొసైటీ ముఖ్య కార్య నిర్వహణాధికారి జి. నగసాయి తెలిపారు.

ఈ ఋణాలను వి.ఎం.ఆర్.డి.ఏ. చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు చేతులమీదుగా పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.నరసింహ మూర్తి, కావురు చరణ్ కుమార్, టేకుమళ్ల అరుణ్ కుమార్, నండూరి సుబ్రహ్మణ్యం, రామభద్రుడు, పి.ఎల్. కె. మూర్తి, హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

ఋణాలు దరఖాస్తు చేసుకోవడానికి బ్రాంచ్ మేనేజర్ కామేష్ని 0891-2561655, 9100921655 నంబర్లలో సంప్రదించవచ్చు.

## మంత్రి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎంపీ భర్త శివప్రసాద్



కొయ్యూరు : అరకు ఎంపి గొడ్డేటి మాధవి భర్త శివప్రసాద్ విశాఖపట్నంలోని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అరకు పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న స్థానిక సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేవిధంగా కృషి చేయాలి



గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,వాటిని అర్హులకు అందేటట్లు కార్యకర్తలు కృషి చేయాలని గాజువాక వైకాపా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. శుక్రవారం జీవీఎంసీ 75వార్డు పెద గంట్యాడ కూడలి వద్ద ఎమ్మెల్యే నాగిరెడ్డి ఎన్నికై యేడాది పూర్తై అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వార్డ్ జిల్లా వైకాపా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గొందేసి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహిం చారు.

ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లా డుతూ సంక్షే మం, అభివృద్ధి ప్రధాన ద్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగు తోందని అన్నారు.

మన స్ఫూర్తిగా నన్ను ఎమ్మెల్యే గా గెలిపించిన గాజువాక ప్రజలకు కృతజ్ఞత లన్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు 90శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

సమస్య ఏదైనా బాధ్యతగా నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. నిర్వహకులు మాట్లాడుతూ సుమారు రెండు వందల మంది రక్త దానం చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఏమిలీజ్వాల, దేవన్, పిట్టారెడ్డి, గంట్యాడ గురుమూర్తి,పరదేసి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకు పండ్లు, పుస్తకాలు పంపిణీ



గాజువాక: ప్రజానాయకుడు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి సంవత్సర కాలం అయిన సందర్భంగా వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు తిప్పల వంశీ రెడ్డి స్ఫూర్తి అనాథ ఆశ్రమం డిజైర్ సోసియైటి లో ఉన్న అనాథ పిల్లలు కు పండ్లు, బ్రెడ్, పుస్తకాలు, పెన్నులు, సబ్బులు, మాస్కులు, నిత్యవసర వస్తువులను శుక్రవారం పంపిణి చేశారు.ఈ సందర్భంగా 74 వ వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి తిప్పల వంశీ రెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ ప్రజలు తిప్పల నాగిరెడ్డి గారికి చరిత్రాత్మక విజయాన్ని అందించి యేడాది పూర్తి అయ్యిందని గుర్తు చేశారు. గాజువాక నియోజకవర్గాన్నీ అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జాన్, గురునాధ్, పెంటయ్య రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రామకృష్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై

## సీపీఎం వినూత్న నిరసన



విశాఖపట్నం : ప్రతీరోజూ భారీగా పెంచుతున్న పెట్రోల్, డిజీల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బైక్ను తాళ్లతో లాగుతూ వినూత్నంగా ఎల్లమ్మతోట సిపిఎం కార్యాలయం రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గితే మన దేశంలో గత నాలుగురోజులుగా ధరలు మోడీ ప్రభుత్వం పెంచుతోందన్నారు. అంతర్జాతీయ ధరల ఆధారంగా మనదేశంలో పెట్రోల్ ధర రూ.18 రూపాయలకే అమ్మవచ్చన్నారు. దీన్నివల్ల ప్రజలపై దాదాపు 2 లక్షల కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. పెట్రోల్ లాభాలు ప్రజలకు అందకుండా కేంద్ర ప్రభుత్వం మార్చి 14న లీటర్కు రూ.3/-లు చొప్పున ఎక్సైజ్ సుంకం పెంచింది. మళ్లీ ఎక్సైజ్ సుంకాన్ని పెట్రోల్కు రూ.10/-లు వరకు డీజిల్కు 13 రూపాయలు పెంచింది. మోడీ ప్రభుత్వం రిలయన్స్ లాంటి కార్పొరేట్ సంస్థలకు లాభాలు సమకూర్చడమే పరమావధిగా పనిచేస్తున్నది. రిలయన్స్ పెట్రోల్ బంకుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఒక రూపాయి అదనంగా వసూలు చేస్తున్న పట్టించుకునే నాధుడే లేడు. ఎన్నికల సందర్భంగా పెట్రోల్ ధరలు నియంత్రిస్తామని బిజెపి ప్రభుత్వం వాగ్ధనం చేసింది. కాని పెట్రోల్, డిజీల ధరలు పెంచుతూనేవుంది. పెట్రోల్, డీజిల్ పెరగటం వల్ల రవాణా చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయి. ఇతర అనేక రంగాలమీద తీవ్రమైన ప్రభావం పడు తుంది. కరోనా మహమ్మారి వల్ల ప్రజలందరూ ఆదాయాలు కోల్పోయి తీవ్రమైన బాధలతో వుంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ప్రజలపై మోయలేని భారాలు మోపుతోంది. ఒకవైపు బిజెపి సంవత్సర పాలన సంబరాలు జరుపుకుంటూ, కార్పొరేట్లకు రాయితీలు, ప్రజలపై భారాలు వేస్తున్నది. ఈ ప్రభుత్వం ఎవరిపక్షాన వున్నదనేది అర్ధమౌతుంది. గతంలో వుండే ఆయిల్పూల్ ఖాతా ఎత్తివేయడంతో పెట్రోల్, డిజీల్ ధరలలో వచ్చిన మార్పులు వినియోగదారుల మీద పడటం వల్ల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. గ్యాస్ సిలిండర్ ధరలు కూడా పెంచుకుంటూపోతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా జిఎస్టి పరిధిలో లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంది.

ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు తగ్గించకపోతే ప్రజాఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని సిపిఎం పార్టీ హెచ్చరిస్తున్నది.

ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జగదాంబజోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, నగర నాయకులు బి.జగన్, చంద్రమౌళి, సూరీడు, జిల్లా నాయకులు జి.కోటేశ్వరరావు, నాయనబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### 54 రవాణా శాఖకు సంబంధించిన సేవలు గ్రామ/వార్డు సచివాలయాలలో ప్రారంభం

విశాఖపట్నం : రవాణా శాఖకు సంబంధించిన కార్యకలాపాలను ఆన్ లైను చేయడం జరిగింది. ఇప్పటి వరకు ప్రజల సౌకర్యార్థం ఎల్.ఎల్.ఆర్ స్లాట్ బుకింగ్, లైసెన్సులకు సంబంధించిన అన్ని సేవలు, ఎఫ్.సి. స్లాట్లు, వాహన పన్నులు ఇలా 84 సర్వీసులను ఆన్ లైను చేయడం జరిగింది. ఇప్పుడు ప్రజల సౌకర్యం కొరకు మరింత చేరువగా వారి వారి ఇళ్ళ వద్ద ఉండే గ్రామ మరియు వార్డు సచివాలయాలలో 54 రవాణా శాఖకు సంబంధించిన సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడమైనది. కొత్త ఎల్.ఎల్.ఆర్ స్లాట్ బుకింగ్, ఎల్.ఎల్.ఆర్. రెన్యువల్, ఎల్.ఎల్.ఆర్ రద్దు, క్రొత్త లైసెన్సు, లైసెన్సు రెన్యువల్, వేరొక్క తరగతి లైసెన్సులో జత చేయడానికి, లైసెన్సులకు సంబంధించిన అన్ని సీవలు, సరుకు రవాణా చేయు వాహనములకు పర్మిట్లు, ప్రయాణీకులను తీసుకుపోవు వాహనములకు పర్మిట్లు ఎఫ్.సి. స్లాట్లు, వాహన పన్నులు, ఎస్.ఓ.సి. మొదలగు

సేవలన్ని కూడా గ్రామ మరియు వార్డు సచివాలయాలలో గ్రామ వాలంటీర్లు/ వార్డు వాలంటీర్ల వద్ద సంప్రదించి రవాణా శాఖకు సంబంధించిన పనులను చేసుకోనవచ్చునని పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.

### లక్ష్మీపురంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



ఆంజనేయస్వామి నూతన ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరుడు దేవ్, తదితరులు

చోడవరం : చోడవరం-వడ్డాది ప్రధాన రహదారిలో లక్ష్మిపురం బొడ్డేడ బ్రిడ్జి సమీపంలోని కళ్లాలు పాల కేంద్రం వద్ద నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం భక్తి, శ్రద్దలతో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోదరుడు జయదేవ్ పాల్గొని స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మిపురం గ్రామ మాజీ సర్పంచ్, వై.సీ.పి నాయకులు శిరిశోళ్ల ఆదిగణపతి నాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## పలకా రవి ఆధ్వర్యంలో నిత్యవసరాలు పంపిణీ



అనకాపల్లి : స్థానిక శాసన సభ్యులు గుడివాడ అమర్నాద్ పదవీ కాలం ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పలకా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ పలకా రవి, కడిమిశెట్టి సతీష్ ఆధ్వర్యంలో నిత్యవసరాలు సరుకులు పంపిణీచేసారు. శుక్రవారం 84వ వార్డులో ఉన్న 25 మంది భవన కార్మికులకు ఒకొక్కరికి వెయ్యి రూపాయలు విలువగల నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేసారు. ఎమ్మెల్యే అమర్నాథ్పై వారికి ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా పలకా రవి మాట్లాడుతూ గడచిన ఏడాది కాలంలో ఎమ్మెల్యే అమర్నాథ్ అనకాపల్లి నియోజవర్గాన్ని అభివృద్ది పదంలో నడిపిస్తున్నారని, అన్నారు. అమర్నాథ్ను మంత్రి వర్యులుగా చూడాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రంలో వైసీపీ నాయకులు మొగలపల్లి సుబ్బారావు, మనోజ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

### సింహాచలం-విజయనగరం నాన్‌స్టాప్ బస్ సర్వీస్ ప్రారంభం

సింహాచలం: సింహాచలం నుండి విజయనగరం కు నాన్ స్టాప్ బస్ సర్వీస్ లను ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుండి అందుబాటులోకి తీసుకువచ్చారు ఈ సర్వీసును రీజనల్ మేనేజర్ ఎం.ఎ దానం సర్వీసును ప్రారంభించారు. డిపో మేనేజర్ మల్లికార్జున మాట్లాడుతూ టికెట్ ధరను 60 రూ॥లు అని రోజుకు మూడు సర్వీసు లు నడుపుతామని సామాజిక దూరం మరియు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటూ బస్ కు 30 మంది ప్రయాణీకులను అనుమతిస్తామని ఆయన తెలిపారు ఈ సర్వీసులు ప్రారంభం తో సింహాచలం వాసులు అప్పన భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పెనుసవాలుగా పర్యావరణం

వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి. పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హాగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది. పర్యావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా ఆహారభద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రభు త్వం చేపడుతున్న చర్యలు ఎంతో మేలు చేస్తున్నాయి. ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన హరితహారంతో మొక్కలు వనాల పెంపకం చేపట్టింది. అనావృష్టిని ఎదుర్కొనేందుకు చెరువుల పునరుద్ధరణ దాదా పు పూర్తయ్యింది. పంటల వైవిధ్యీకరణకు బాటలువేసింది. దీంతో పర్యావరణ మార్పులు విపరీతంగా చోటు చేసుకున్నప్పటికీ, సాగును సజావు గా సాగించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది. ఒక్క మాట లో చెప్పాలంటే, పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు, తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే తయారైందని తెలుస్తున్నది. వాతావరణ మార్పులతో అభివృద్ధి దేశాల్లో ఆహారధా న్యాల ఉత్పత్తి తరిగిపోతున్నది. మరో రెండు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగి తే దేశంలో ప్రధాన ఆహారపంట వరి ఉత్పాదకత హెక్టారుకు ఒక టన్ను తగ్గిపోనున్నది. 2050 నాటికీ ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా, దేశంలో మరో ప్రధాన ఆహారపంట గోధుమ ఉత్పాదకత తగ్గిపోతుంది. సాగుకు అనుకూల భూమి తగ్గిపోనున్నది. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటరకాలు సాగుకు పనికిరావు. ఏడాదికి ఒక్క మన దేశంలోనే దాదాపు 70 లక్షల టన్నుల మేర ఉత్పత్తి పడిపోనున్నది. దీనికితోడు ఆకస్మిక వరదలు, వర్షాల లేమి సంభవించనున్నాయి. 2009లో సంభవించిన అననుకూల వర్షాభావ పరిస్థితుల వల్ల, ఒక కోటి 50 లక్షల టన్నుల వరి, 40 లక్షల టన్నుల ఇతర ఉత్పత్తి పడిపోయింది. పర్యావరణ మార్పుల వల్ల, అసాధారణ పరిస్థితులు భారత వ్యవసాయంలో చోటుచేసుకుంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఒక్క 2015లోనే దేశంలో 15 రాష్ట్రాలు వీటి ప్రభావాన పడితే, దాదాపు 33 శాతం పంటల సాగు విస్తీర్ణం దెబ్బతిన్న ది. ఇరువై వేల కోట్ల రూపాయల పైనే రైతులు నష్టపోయారు. పంటల బీమా లాంటి పథకాలతో ఆదుకుంటే తప్ప, రైతు సాగులో నిలబడలేరని భారత హరితవిప్లవ పితామహులు స్వామినాథన్ గుర్తుచేయాల్సి వచ్చిం ది. ఇది దేశ ఆహారభద్రతకు ప్రత్యక్ష హెచ్చరిక. ఎంత త్వరగా పరిష్కారం వెతికితే, అంత త్వరగా దేశం, ఆహార భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు మరిన్ని పర్యావరణ సవాళ్లు పొంచి ఉన్నట్లు ప్రపం చబ్యాంకు షాక్ వేవ్స్' నివేదిక తెలుపుతున్నది. పర్యావరణ మార్పుల ప్రభావాన్ని గత 25 ఏండ్లలో అధ్యయనంలో 14 శాతం ప్రజలు పేదరి కం నుంచి బయటపడితే, ఏడాదికి సరాసరిన 12 శాతం ప్రజలు మళ్లీ పేదరికంలోకి నెట్టివేయ బడుతున్నారు. ఎండల తీవ్రత, వర్షాల లేమి వల్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 25 ఏండ్లలో 15 వేల మందికి పైగా పేదలు చనిపోయారు. ప్రపంచంలో సూడాన్ దేశం తర్వాత, అత్యధిక మరణాలు జరిగినయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే. 2030 నాటికీ ఐదు శాతం మేర ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో పేదరికం పెరుగనున్నది. 2030 నాటికీ పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టకపోతే, పేదరికం 30 శాతానికి చేరుకోనున్నది. కరువు, నీటికొరత, తద్వారా పంట నష్టాల వల్ల పంటల దిగుబడులు తగ్గి ఆహారకొరత పెరగనున్నదని నివేదిక తెలిపింది.

# మంత్రి అవంతి పుట్టినరోజును పురస్కరించుకొని చీరలు పంపిణీ



అక్కయ్యపాలెం : రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక మరియు యువజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు శుభసందర్భంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కర్త సూచనలు మేరకు బాలయ్య శాస్త్రి లేఔట్ లో గల సిందూర ఫంక్షన్ హాల్ లో జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యన్నారాయణ అద్వర్యం లో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు అదీప్ రాజ్, మాజీ శాసనసభ్యులు మల్ల విజయ్ ప్రసాద్, అనిల్ కుమార్ రాజు, రొంగలి జగన్నాధం, పీవీ సురేష్, పొట్టి మూర్తి తదితరులు హాజరైనారు.



## మంత్రి అవంతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక యువజన సంక్షేమ శాఖ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు(అవంతి) జన్మదిన సందర్భంగా వి ఎం అర్ డి ఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో అభినందిస్తున్న దృశ్యం, వీరితో పాటుగా అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్నాథ్, నర్సీపట్నం శాసన సభ్యులు పేట్ల ఉమా శంకర్ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తితిదే ఉద్యోగికి కరోనా నిర్ధారణ

తిరుమతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అనుబంధ ఆలయానికి కరోనా సెగ తాకింది. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి కరోనా నిర్ధారణ అయినట్లు తితిదే ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆలయంలోకి భక్తుల ప్రవేశాన్ని రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు తితిదే వెల్లడించింది.

పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సదరు ఉద్యోగి కరోనా పరీక్షలు చేయించుకోగా అందులో పాటిజివ్ వచ్చినట్లు ప్రకటనలో వెల్లడించింది.

## సమయం

### గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్లు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్
సెల్ నెం: 98486 44336

## పంచాంగం

మాసం : జ్యేష్ఠ; తిథి: అష్టమి రా.1.18; పూ.భా.రా.10.20; వర్జ్యము లేదు.

శనివారం 13-06-2020

**మేషం** : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**వృషభం** : వైద్యులకు శస్త్రచికిత్స చేయు నపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది.

**మిధునం** : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**కర్కాటకం** : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**కన్య** : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**తుల** : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**వృశ్చికం** :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగుతాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**ధనుస్సు** : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.

**మకరం** :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**కుంభం** : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగుతున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూలమవుతాయి.

**మీనం** : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

# ఆపదలో ఆదుకునే నారసింహుడు

## సంకీర్తన



నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసమే ఆవిర్భవించాడు కనుక, భక్తులను ఆదుకోవడంలోను .. అనుగ్రహించడంలోను ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడని అంతా విశ్వసిస్తుంటారు. ఆ స్వామి కొలువైన ప్రాచీనమైన క్షేత్రాల్లో ప్రకాశం జిల్లా పరిధిలో గల 'సింగరాయ కొండ' ఒకటిగా కనిపిస్తూ వుంటుంది. ఈ క్షేత్రం మహిమాన్వితమైనదని చెప్పబడే ఎన్నో సంఘటనలు ఇక్కడ కథలు .. కథలుగా వినిపిస్తూ వుంటాయి.

పూర్వం ఈ స్వామిని అర్చించే పూజారి, పసివాడైన తన బిడ్డతో సహా ఆలయానికి వెళ్లి, స్వామివారికి నైవేద్యం సమర్పించి వెనుతిరిగాడట. తన బిడ్డను ఆలయంలో మరిచిపోయి వెళ్లిన ఆయనకి, చాలా సేపటి తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. తన మతిమరుపుకు తిట్టుకుంటూ, పరుగు పరుగున ఆలయం దగ్గరికి చేరుకున్నాడు. పిల్లవాడు ఆకలితో ఏడుస్తూ ఉంటాడని అనుకుంటూ, ఆతృతగా తలుపులు తెరిచాడు.

ఆలయంలో ఆడుకుంటోన్న పిల్లవాడిని చూసి ఆనందంతో పొంగిపోయాడు. పిల్లవాడిని అక్కున చేర్చుకుని "ఆకలి వేయలేదా?" అని అడిగితే, నరసింహస్వామి మూర్తిని చూపించి ఆయన తనకి అన్నం తినిపించాడని చెప్పాడట. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా ఉన్నాడని చెప్పడానికి ఇదొక నిదర్శనమని చెబుతుంటారు. ఇక్కడి నారసింహుడు మనసున్నవాడనీ .. మహిమగలవాడనీ .. ఆపదలో ఆదుకునే బంధువని విశ్వసిస్తుంటారు.

### ఈ శకునం శుభసూచకమే !

ఏదైనా ఒక ముఖ్యమైన పనిమీద ఎక్కడికైనా వెళ్లాలని అనుకున్నప్పుడు, శకునం చూసుకుని బయలుదేరుతూ వుంటారు. కాస్త ఆలస్యమైనా మంచి శకునం చూసుకునే అడుగు బయటికి పెడుతుంటారు. ఇలా మంచి శకునం చూసుకుని బయలుదేరడం వలన, వెళ్లిన పని సఫలీకృతమవుతుందనే విశ్వాసం పూర్వకాలం నుంచీ వుంది. ఎవరికి వాళ్లు తాము తలపెట్టేకార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలనే ఆశిస్తారు. అందుకే శకునానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు.

ఈ నేపథ్యంలో కొన్ని శకునాలు మంచివిగా ... మరికొన్ని శకునాలు అందుకు విరుద్ధమైనవిగా చెప్పబడుతున్నాయి. ఇక కార్యసిద్ధిని కలిగించే శకునాలలో పూలు - పండ్లు కనిపిస్తూ వుంటాయి. సాధారణంగా దైవదర్శనానికి వెళ్లాలని అనుకోగానే ముందుగా గుర్తుకువచ్చేది పూలు .. పండ్లే. భగవంతుడిని పూలతో అలంకరిస్తూ .. అర్చిస్తూ వుంటారు. ఆయనకి వివిధరకాలైన పండ్లను నైవేద్యంగా సమర్పిస్తూ వుంటారు.

ఇక శుభకార్యాలలోను పూలు - పండ్లకి ప్రధానమైన స్థానం ఇవ్వబడుతుంది. ఇవి లేకుండా శుభకార్యమనేది జరగనే జరగదు. దీనినిబట్టి పూలు - పండ్లు ఎంతటి శుభప్రదమైనవో అర్థంచేసుకోవచ్చు. అందువలన పూలబుట్టతో గానీ .. పండ్లబుట్టతో గాని ఎవరైనా ఎదురురావడం శుభసూచకంగా విశ్వసించడం జరుగుతోంది. పూలతోను ... పండ్లతోను కూడిన శకునం మంచిదిగా భావించి వెంటనే బయలుదేరవచ్చని స్పష్టం చేయబడుతోంది.

# బీసీలను అణిచివేస్తున్న వైకాపా ప్రభుత్వం : విల్లూరి చక్రవర్తి

## 33వ వార్డులో నిరసన కార్యక్రమం



విశాఖపట్నం : 33వ వార్డులో శుక్రవారం హరిజన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీలను అణిచివేస్తున్న వైకాపా ప్రభుత్వం- విల్లూరి డాక్టర్ చక్రవర్తి తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మరియు 33వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి విల్లూరి తిరుమల దేవి ఆధ్వర్యంలో రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నప్పుడు నుండి బీసీలను (వెనుకబడిన వర్గాలను) అణిచివేయడమే లక్ష్యముగా మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అక్రమ అరెస్టును 'ఆయన తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగడం ఇష్టంలేకే ముఖ్యమంత్రి ఇలాంటి దుర్మార్గపు చర్యలకు దిగుతున్నారని అన్నారు. ఇది అరెస్టు లాగా లేదని 'వైకాపా చేసిన కిడ్నాప్ లాగా అనిపిస్తుందని' తెలిపారు. శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైకాపా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై కాకుండా బీసీ నాయకులను అణిచివేయడంలోను, కక్ష రాజకీయాలు చేయడంపై దృష్టి సారించారని అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారనే అచ్చెన్నాయుడుని అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. ఈ నెల 16నుండి జరుగు అసెంబ్లీ లో టీడీపీ నాయకులు వైకాపా ప్రభుత్వం చేస్తున్న అవి నీతిని ప్రశ్నిస్తారనే భయంతోనే కక్షపూరిత చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. వైకాపా ప్రభుత్వం ఉత్తారంధ్రకు చేస్తున్న ద్రోహాన్ని ప్రశ్నిస్తున్నందుకే అక్రమ అరెస్టు చేశారని అన్నారు.ఈ కార్య క్రమంలో దొడ్డి రాంబాబు, సరగడం భాస్కర్, కంఠంశెట్టి వేణు, వాసుపెల్లి దాసారావు, బి వాసు,ఎల్ దుర్గారావు, కోనూరు గంగ, దాసరి వరలక్ష్మి, కె.అరుణ్ జ్యోతి తదితరులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# బి.కింతాడలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు




దేవరాపల్లి : మండలం లోని బోయిల కింతాడ గ్రామంలో ఎంపీపీ స్కూల్ వద్ద విశాఖపట్నానికి చెందిన శ్రీ రాఘవేంద్ర కంటి ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం జరిగిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు బూరె బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది కంటి సమస్యలు ఉన్న రోగులకు డాక్టర్ మురళి కంటి పరీక్షలు జరిపి, అందులో కొంత మంది కి సర్జరీ అవసరం అని నిర్ధారించడం జరిగింది. వీరందరకి కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి రానుపోను హాస్పిటల్ వారే ఖర్చులు భరించి భోజనం ఏర్పాటు చేసి వీరికి ఆపరేషన్ అనంతరం ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకొను సమయానికి జగనన్న ప్రభుత్వం నుంచి సుమారు ఒక వ్యక్తికి 3500 రూపాయలు వారి యొక్క బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని ఈ ఒక్క అవకాశాన్ని మరింతమంది సద్వినియోగం చేసుకుంటారని బాబురావు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చిరికి శ్రీనివాస రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జాజిమొగ్గల ప్రసాద్ వీఆర్వో జానకి, స్థానిక ప్రజా ప్రతినిధులు అన్నం వెంకట్రావు, బొబ్బిలి రాము, కోన శ్రీను, మజ్జిశివ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తున్న టీడీపీ నాయకులు



విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి వర్యులు ప్రస్తుత ఎమ్మెల్యే కింజరాపు అచ్చెంనాయుడుని శుక్రవారం అక్రమంగా అరెస్ట్ చేశారు. బడుగు బలహీన వర్గాలు అణచివేతే అతని ధ్యేయంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వై.స్.జగన్మోహన్ రెడ్డి ప్రవర్తిస్తున్నారు. ఈ అరెస్టను 56వవార్డు బీసీ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి శరగడం రాజశేఖర్ తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ కార్యక్రమం లో వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల్లోనూ... వివేకానంద సంస్థ సేవా కార్యక్రమాలు

## గర్భిణీలు, బాలింతలు, అనాధలకు ఆహారం పంపిణీ



విశాఖపట్నం : వర్షాల్లోనూ..వివేకానంద సంస్థ సేవా కార్య క్రమా లను అలుపెరగకుండా నిర్వహిస్తోంది. సంస్థ సభ్యులు వర్షాలను సైతం లెక్కచేయకుండా.. అన్నారులకు ఆహారం ఆహారం అంద జేస్తున్నారు. గర్భిణీలు, బాలింతలు, అనాధలు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, రైతులు, హమాలీలు, పారిశుద్ధ్య కార్మి కులు ఎవ్వరూ ఆకలితో ఉండకూడదని ఆశ యంతో. వారి దగ్గరికి తీసుకెళ్ళి అందజేస్తున్నారు. వర్షాల కారణంగా.. అనేక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. ఎన్నో వ్యయ ప్రయాసలకులోనై.. సకాలంలో వారందరికీ ఆహారం అందజేస్తున్నారు.

భారీ వర్షం ధాటికి నిలువ నీడ లేక చిమ్మచీకట్లో బిక్కు బిక్కుమంటూ దుకాణాల ముంగిట ఓ మూలన కూర్చుం టున్న అనాధలను వెతికి మరీ ఆహార పొట్లాలు అందిస్తున్నారు. మంచి మనసున్న దాతలు ముందుకు వస్తే.. ఇంకా ఎక్కువ మంది ఆకలి తీరుస్తామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు దాతలకు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డుపై పేరుకుపోయిన ఎర్రమట్టి ?



అరకులోయ : మండలంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడ గ్రామ సమీపంలో అన్న మీద ఎర్రమట్టి ప్రధాన రహదారిపై కి చేరి బురదపలని తలపెడుతుంది. తడక, లోతేరు ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ సమస్య పట్ల సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు వాహన చోదకులు వాపోతున్నారు.

# అరకు సంతలో ట్రాఫిక్?



అరకులోయ : శుక్రవారం అరకు సంతలో రోడ్డుపైనే సంత జరగటం వలన భారీ ట్రాఫిక్ గా మారింది అంతేకాకుండా గత మూడు నెలల నుండి ప్రజలు సంతలు జరగక పోవడం వలన నిత్యావసర సరుకులు దొరక్క మారు మూల గిరిజన రైతులు చాలా ఇబ్బందికి పాల్పడ్డా అనే మాటలు వినిపిస్తున్నాయి ప్రభుత్వం లాక్ డౌన్ సడలింపు చడం వల్ల రైతులు అన్ని రకాల సరుకులు సరుకులు క్రయ విక్రయాలు చేయటానికి వారపు సంతలో రాక తప్పలేదు అంటూ పలువురు రైతులు వాపోతున్నారు.

# జనసేన కార్యాలయానికి శంకుస్థాపన



పరవాడ : పెందుర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న 79వ వార్డు దేశపాత్రుని పాలెం గ్రామంలో జన సైనికులు మరియు జనసేన నాయకులు సహాయ సహకారాలతో జనసేన పార్టీ నూతన కార్యాలయం నిర్మించేందుకు శ్రీకారము చుట్టారు. దీంట్లో భాగంగా శుక్రవారము జనసేన పార్టీ కార్యాలయానికి శంకు స్థాపన చేశారు. ఈ కార్య క్రమంలో జనసేన పార్టీ నాయకులు మోటూరి సన్యాసినాయుడు, మాజీ కార్పొరేటర్ దుల్లా రాము నాయుడు దేశపాత్రుని పాలెం జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భరణికంలో ఎమ్మెల్యే అధీప్ ఏడాది వేడుకలు



పరవాడ: ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ ఎమ్మెల్యే పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా భరణికం గ్రామంలో శుక్రవారము పరవాడ మండల యువజన అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్ కేక్ కట్ చేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రైస్ కార్డులపై వివరణ

అనంతగిరి : పౌర సరఫరాల శాఖ వారు కొత్త రైస్ కార్డులు, కార్డులు సభ్యులను చేర్చుట, తొలగించుట, కార్డు సరెండర్ చేయడం మరియు స్ప్లిట్టింగ్ గురించి వివరణ ఇచ్చియున్నారు.

కొత్త రైస్ కార్డు కి సంబంధించి దరఖాస్తు దారులు ఏ కార్డులో లేనట్లయితే వారికి అప్లై చేయవచ్చు. కుటుంబం లో అబ్బాయి కి వివాహం జరిగి కొత్త కార్డు కావాలంటే ముందుగా తన భార్యను అబ్బాయి కుటుంబ కార్డు లో యాడ్ చేయాలి. తర్వాత వారిని స్ప్లిట్ చేయాలి. స్ప్లిట్ చేశాక కొత్త కార్డు కి అప్లై చేయవలసి వస్తుంది. కార్డు లో సభ్యులను చేర్చుట, కార్డు లో సభ్యులను చెర్చుట కేవలం చిన్న పిల్లలు మరియు వివాహం జరిగిన స్త్రీల ను మాత్రమే కార్డులో చేర్చగలము.

చిన్న పిల్లని చేర్చుటకు కచ్చితంగా వారి బర్త్ సర్టిఫికేట్ మరియు ఆధార్ కార్డు కావలెను. వివాహం అయిన స్త్రీ కి ఆమె ఆధార్ కార్డు,ఆమె తల్లి తండ్రుల రైస్ కార్డు నంబర్ మరియు వివాహం చేసుకున్న వారి కుటుంబం రైస్ కార్డు కావలెను.....వీరిని వారి అమ్మ వాళ్ళ కార్డు నుండి డైరెక్ట్ గా యాడ్ మెంబర్ సర్వీస్ ద్వారా ట్రాన్స్ఫర్ చేయవచ్చు.

కార్డు నుండి తొలగింపు

రైస్ కార్డు నుండి తొలగింపు కేవలం లిచనిపోయిన వారికి మాత్రమేలి ..... ఎవరైనా రైస్ కార్డు లో ఉన్న సభ్యులు చనిపోయినట్లైతే వారికి మాత్రమే డిలీట్ మెంబర్ సర్వీస్ వర్తిస్తుంది.. స్ప్లిట్ చేయాలంటే ముందు ఆ సభ్యులు ఒకటే రైస్ కార్డు నందు ఉండవలెను....అప్పుడు మాత్రమే స్ప్లిట్ చేయడం సాధ్యమవుతుంది....

అలాగే స్ప్లిట్ అవ్వాల్సిన సభ్యులు కచ్చితంగా చేయించు కోవాలి లేదంటే స్ప్లిట్ సాధ్యం కాదు. కుటుంబం లో తల్లి తండ్రుల లలో ఒకరు మాత్రమే ఉన్నట్లైతే అంటే తల్లి ఉండి తండ్రి లేకపోవడం లేదా తండ్రి ఉండి తల్లి లేనట్లయితే స్ప్లిట్ అవ్వడం వీలు కాదు.....

అందరూ ఆ రైస్ కార్డు నందు ఉండవలసిందే.. పైన తెలిపిన నాలుగు సేవలకు కెవైసి చాలా ముఖ్యం....కెవైసీ జరిగితేనే ఏ సేవయిన వర్తిస్తుంది.... సింగిల్ పర్సన్ కి కొత్త రైస్ కార్డ్ అప్లై అవ్వదు. చనిపోయిన వ్యక్తి కి మాత్రమే డిలీట్ ఆప్షన్ పెట్టాలి.. స్ప్లిట్ అవ్వాలన్న / వివాహం అయిన మహిళ.. భర్త కుటుంబ కార్డు లో చేర్చాలన్న వారు ఇప్పుడు ఏ కార్డులో ఉంటే ఆ కార్డులో లి%జుఎఎష%లి పూర్తి అయ్యి ఉండాలి...

15 సం.ల లోపు పిల్లలు తల్లిదండ్రుల కార్డులో చేర్చాలంటే పిఎస్ఎస్ సర్వేలో ఇ-కెవైసి పూర్తి చేసి ఉండాలి.

# మాస్కులు ధరించకుండా బయటకు వస్తే కఠిన చర్యలు



అచ్యుతాపురం : మాస్కులు ధరించకుండా నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ కె వెంకటరావు అన్నారు . శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి మండల కేంద్రమైన అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న 40 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు.

ప్రజలు తమ ఆరోగ్యాన్ని, ఇతరుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తప్పని సరిగా మాస్కులు ధరించాలన్నారు. ఎవరైనా మాస్కులు ధరించ కుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు తప్పని అవస్థలు



దేవరాపల్లి : రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. 4.30 గంటల సమయంలో ఈ ఫలితాలను విడుదల చేసిన రాత్రి 8 గంటల వరకు కొందరు విద్యార్థులకు ఆన్ లైన్ ఫలితాలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఇంటర్ ఫస్టియర్, సెకండ్ ఇయర్ ఫలితాలు ఒకేసారి విడుదల కావడంతో సర్వర్ మొరాయించింది.దీనితో విద్యార్థులు ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కొంత అసహనం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ భవనములకు స్థల నిర్ధారణ

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి యు.కూర్మారావు



అనంతగిరి : మండలంలో గతంలో స్థల వివాదం వల్ల నిలిచిపోయిన ఎన్.ఆర్.పురం గ్రామ సచివాలయం భవనము నిర్మాణమునకు మరియు రైతు భరోసా కేంద్రం,హెల్త్ వెల్నెస్ సెంటర్లు స్థల నిర్ధారణ కోసం శుక్రవారం తహసిల్దార్, వెంకట వరప్రసాద్ సర్వేయర్, శ్రీనివాసరావు, యర్, ఐ ,వి.ఆర్.ఓ లు మండల ఇంజనీరింగ్ అధికారి వారికి,మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి యు,కూర్మారావు మరియు సచివాలయ కార్యదర్శి ల సమక్షంలో కొలతలు వేసి, స్కెచ్ లతో సహ అప్పగించి పనులు మొదలు పెట్టుటకు సిద్ధపరుచుట జరిగిందని, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి యు. కూర్మారావు తెలిపారు.

# 'లఘు ఉదయోగ్ భారతి'కి స్వాగతం

విశాఖపట్నం : ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్లో కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగంలో "ఆత్మనిర్భార్ భారత్ అభియాన్ అండ్ స్వావలంబన్ అండ్ ఏ న్ బి ఏ " పై సంభావిత బోధనపై మేము "లఘు ఉదయోగ్ భారతి" ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ హృదయపూర్వకంగా స్వాగతం పలికాము. " ఏ న్ బి ఏ " ప్రయత్నాలకు గౌరవ ప్రధాన మంత్రికి మాపూర్తి మద్దతును తెలియజేయాలని మేము కోరుకుంటున్నాము.

## స్మార్ట్ సిటి నిధులతో నిర్మించిన పడవల నిర్మాణ కేంద్రంను కమిషనర్ ఆకస్మిక తనిఖీ



కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కమిషనరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐ.ఏ.ఎస్, శుక్రవారం ఆకస్మిక తనిఖీలలో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలో స్థానిక జగన్నాధపురం నందు స్మార్ట్ సిటి నిధులతో నిర్మించిన పడవల నిర్మాణ కేంద్రంను తనిఖీ చేసినారు సదరు ప్రాజెక్ట్ అంతిమ దశకు వచ్చి యున్నందున త్వరలో సదరు యార్డును ప్రజా ఉపయోగంలోకి తేవాలని ఆదేశించినారు. అదే ప్రాంతంలో నున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడ వైద్యుల కొరత ఉన్నదని స్థానికులు మరియు కార్పొరేటర్ విన్నవించగా సదరు ఆరోగ్య కేంద్రమునకు వైద్యులు కొరత లేకుండా వైద్యు లను, వైద్య సిబ్బంది ని సర్దుబాటు చేయుటకు తగు చర్యలు చేపడతానని తెలిపినారు. తదుపరి నగర పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేయుచూ స్థానిక రామక్రిష్టనరావుపేట నందు పారిశుధ్య కార్మికు రాలిని ఆపి తాను ఇంటి ఇంటికి వెళ్ళి ప్రజలను చెత్త ఇవ్వమని ఎట్లు అడుగునో స్వయంగా ఆమెతో వెళ్ళి పరిశీలిం చినారు. అదేవిధంగా నగరంలో ఇంటి ఇంటి చెత్త సేకరణలో చెత్త సేకరణ అయిన తదుపరి ఇంటికి అతికించిన ఆర్.ఎఫ్.ఐ.డి. ట్యాగ్ ను ఎట్లు స్కానింగ్ చేయుచున్నారో అని అడిగి తెలుసుకున్నారు. తదుపరి అదే ప్రాంతంలో రోడ్డు మార్జిన్లలో ఆక్రమించి ఉన్న మరియు కాలువ పై ప్రాంతంలో ఉన్న దుకాణుదారుడను మందలించి అపరాధ రుసుమును వసూలు చేయించినారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ కార్యాలయం నుండి రామకృష్ణారావు పేట మీదుగా వై.ఎస్.ఆర్.వారధి వరకూ వెళ్ళు రోడ్డు కు ఇరువైపులా ఆక్రమణ దారులు రోడ్లపైకి వచ్చి వారి వ్యాపారములు చేయుట వలన రహ దార్లుపై రద్దీ ఏర్పడు తుందని ఇకపై రోడ్డుకు ఇరువైపులా ఎవరూ ఆక్రమణలు చేయరాదని అట్లు చేసిన వారిని గుర్తించిన ఎడల వారిపై జరి మానాలు విధించుట, చట్ట పరమైన చర్యలు చేపడతానని హెచ్చరించినారు. ఈ పర్యటనలో కమిషనర్ వారితో పాటు సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యనారాయణ రాజు, ప్రజారోగ్య విభాగా ధికారి పి.ప్రశాంత్, స్మార్ట్ సిటి సిబ్బంది ఇతర సిబ్బంది హాజరయ్యారు.

## రేషన్ సరుకులు ఉచితంగా ఇవ్వాలి



కోటఉరట్ల: కోటఉరట్ల మండలం కొడవటి పూడి గ్రామంలో సిఐటియు పోస్టర్ల ఆవిష్కరణ చేసిన అనంతరం ప్రతి కుటుం బానికి రూ:7500/-లు 17రకాల నిత్యావసర సరుకులు రేషన్ షాపుల ద్వారా 6 నెలల పాటు ఉచితంగా ఇచ్చి కరోనా అరికట్టాలని ప్రభుత్వ రంగాన్ని ప్రవేటిప రం చెయ్యొద్దంటు ఈనెల 16వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో...

దేశ వ్యాప్తంగా అన్ని మండల త్హాశీల్దార్ కార్యాల దగ్గర జరిగే ధర్నా లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం కోటవురట్ల మండల కన్విన ర్ పెంటకోట వెంకటస్వామి ఆధ్వర్యంలో కొడవటి పూడి గ్రామంలో...

ఉపాది హామీ పథకం కూలీలతో కలిసి పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది.

అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం 16.6.2020 న కోటవురట్ల మండలం లో గల త్హాశీల్దార్ దగ్గర జరిగే ధర్నాలో మండలంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాన్నారు.

## మురుగు కాలువ మూసివేతపై స్పందించిన అధికారులు
### హర్షించిన గ్రామస్తులు

యానాం: సుమారు 150 సం.గా కనకాలపేట గ్రామం నుండి వర్షపు, వరద, మురుగునీరు, వ్యవసాయేతర నీరు కనకాల పేట నుండి సుంకరపాలెం ఊటకాలువ మీదుగా ప్రవేశించి బైపాస్ 216 మీదుగా మెట్టకురు గణపతి నగర్ గోదావరి నది పాయలో సుమారు 2 కి . మీ ప్రవహించి కలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ సెక్షన్ 23 నీరు భూమి మరియు చెట్లు అధికారణ 2002 ప్రకారంగా నది ప్రవహలు, నీటి కాలువలు కప్పిపుడ్చి ఎటువంటి కట్టడాలు అను మతించ రాదు. ఇదే విధంగా తెలంగాణ హైకోర్టు ఉత్తర్వలు 2016 ప్రకారం నీటి కాలువలు , గుంటలపై ఎటువంటి కట్టడాలు కట్టరాదు . ఈ యొక్క ఉత్తర్వులను ధిక్కరించి సుమారు 150 సం. గా ఉన్న ఊటకాలువను పూడ్చివేసి కట్టడాలు నిర్మించే యోచనలో ఈ యొక్క ఊటకాలువను మట్టితో నింపివేయటం జరుగుతుంది. నీరు వెళ్ళే దారిని పూడ్చి వేయడంతో నీటి ప్రవహానికి అడ్డుచేకూరు తుందని కనకాలపేట గ్రామస్తులు ఆందోళన చెంది అటు ఆంధ్రప్రదేశ్ మరియు పుదుచ్చేరి ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడి ఆదేశాలమేరకు యానాం పరిపాలనాధికారి ఆ.ఎ.ఓ శివరాజ్ మీనా ఆస్థలమును పర్యవేక్షించి ఆంధ్ర ఆధికారులతో మాట్లాడారు. నీరు ప్రవహనికి అడ్డుగా ఎటు వంటి ఆటంకాలు ఉండవని కట్టడాలు కట్ట బోమని యానాం ఆ.ఎ.ఓకి ఆంధ్ర ఆధికారులు తెలిపారు. ఈ విషయమై కనకాల పేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తంచేసి పుదుచ్చేరి మరియు ఆంధ్రప్రదేశ్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ విషయమై నిమ్మకాయల శ్రీనివాసరావు, కోన వెంకటరత్నం, తోట భైరవస్వామి పాల్గొన్నారు.

## మసీదులను పరిశీలించిన అర్ఏఓ, ఎస్పీ



యానాం : ప్రార్థనా మందిరాలను తెరుచుకున్న తర్వాత వచ్చిన మొదటి శుక్రవారం కావడంతో నిబంధనల ప్రకారం మసీదులో ప్రార్థనల సమయంలో మాస్క్ లు ధరించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలుసుకోవడానికి రీజనల్ అడ్మినిస్ట్రేటర్ శివరాజ్ మీనా శుక్రవారం యానాంలోని మసీదులను పరిశీలించారు . ఈ సందర్భంగా చింతావారి వీధి సమీపంలోని జామియా మసీదు . ఫ్రాన్స్ తిప్పలోని మసీదును ఆయన పరిశీలించి ముస్లిం సోదరులతో మాట్లాడారు . ప్రార్థనల సమయంలో మాస్కు ధరించాలని , శానిటైజర్లు ఏర్పాటు. భౌతికదూరం పాటించడం చేయా లన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జ్ ఎస్ పి చోడిశెట్టి రాధాకృష్ణ ప్రార్థనలకు వచ్చేవారు లాక్ డౌన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించెల మసీదు కమిటీ సభ్యులు చూసుకోవాలన్నారు.

## 'సన్నిధి గొల్లల' సమస్యను పరిష్కరించడం
### చాలా ఆనందదాయకం : వెంకటరావు



విజయనగరం : తిరుమల శ్రీవారి ఆలయం " సన్నిధి గొల్లకు " వారసత్వం హక్కును కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, చట్టం రూపొందించే దిశగా రానున్న అసెంబ్లీ సమావేశంలో తీర్మా నించుటకు గాను రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి చొరవ చూపటం చాలా హర్షించ దగినదని శ్రీ గదుల వెంకటరావు, విజయనగరం జిల్లా యాదవ మహాసభ అధ్యక్షులు తెల్పారు. దశాబ్దాలుగా అపరిష్కృ తంగా మిగిలినట్టి " సన్నిధి గొల్లల " సమస్యను చరిత్రలో నిలిచి పోయే విధంగా ముఖ్యమంత్రి పరిష్కరించటం చాలా ఆనంద దాయకం. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీమేరకు వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలు మేనిఫెస్టోలో పొందు పరచి, దానిని అమలు పరిచే దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకోవటం యావత్ యాదవ కుల ప్రజా నీకానికి జగన్ మోహన్‌రెడ్డి గారిచ్చిన వరంగా భావిస్తున్నాము. ఆంధ్ర ప్రదేశ్‌లో సుమా రుగా 70లక్షలు యాదవ సామాజిక కుటుంబాల తరపున ముఖ్యంగా విజయ నగరం జిల్లా యాదవ జాతి తరపున ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెల్పు తున్నాము. చిరకాలంగా పరిష్కారంకాని " సన్నిధి గొల్ల " వారసత్వమును కొనసాగించే దిశలో ప్రభుత్వం చేపట్టే కృషితో భాగస్వాములైన విజయనగరం జిల్లా మంత్రివర్యులు, శాసన సభ్యులు మరియు పార్టీ పెద్దలు అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెల్పు కొనుచున్నాను.

### తెదేపాను టార్గెట్ చేయడం
## వైకాపా ప్రభుత్వానికి తగదు


నిరసన తెలుపుతున్న శ్రీలక్ష్మి

ములగాడ: సుపరిపాలన అందించి ప్రజల మన్నలను పొందిన గత తెదేపా ప్రభుత్వం పై వైకాపా ప్రభుత్వం టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించడం తగదని, ఇది ముమ్మాటికీ కక్ష్య సాధింపు చర్యని జీవీఎంసీ61వార్డ్ తెదేపా అభ్యర్థిని సర్వసిద్ది శ్రీలక్ష్మి వైకాపా ప్రభుత్వం పై మండి పడ్డారు. మాజీమంత్రి అచ్చెన్నాయుడు కార్మిక శాఖ మంత్రి గా ఉన్నప్పుడు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో అ.ని.శా. అధి కారులు శుక్రవారం శ్రీకాకుళంలోఅరెస్ట్ చేసిన విధానం పై ఆమె స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అచ్చెం నాయుడు ను అరెస్టు చేసిన తీరు చూస్తుంటే వైకాపా ప్రభుత్వం ఎంత దౌర్జన్యంగా వ్యవహ రిస్తుందో తెలుస్తోందని అన్నారు.

ఈ అరెస్ట్ లో భారీ కుట్ర దాగివుందని అనుమానం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు మొదలవబోతున్న నేపథ్యంలో అచ్చెంన్నాయుడుని అసెంబ్లీ లో అడుగు పెట్టకుండా చేయటం అధికార పార్టీ ఎత్తుగడని, ఈ అరెస్ట్ ప్రకియను పూర్తిగా ఖండిస్తున్నామని శ్రీలక్ష్మి తెలిపారు.

ఇలాంటివి పునరావృతం కాకుండా వైకాపా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని, లేనియెడల ప్రజలే తగిన బుద్ధి చెబు తారని హెచ్చరించారు. నిరసన తెలిపినవారిలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రైతు భరోసా కేంద్రాల సేవలు విస్తృతం కావాలి : కలెక్టర్ నివాస్



శ్రీకాకుళం : గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సేవలు విస్తృతం కావాలని కలెక్టర్ జె.నివాస్ సూచించారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 655 రైతు భరోసా కేంద్రాలకు స్థలాల సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు.

ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన జిల్లా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. రాజాం మండలంలో 13 గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను సమకూర్చాలని, అక్కడ రెవెన్యూ అధికారులు లక్ష్యం సాధించలేకుంటే తాము వచ్చి ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో...

ప్రత్యేకాధికారి ఆర్.వెంకటరామన్, తహసీల్దార్ ప్రవల్లికప్రియ, ఏపీడీ అలివేలు మంగమ్మ, వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి, తదితరులు పాల్గొన్నారు.

## 'పాఠశాలలు తెరిచేనాటికి పనులు పూర్తి చేయండి

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరం, పొందూరు గ్రామీణం, నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలలు తెరిచేనాటికి తొలిదశలో చేపడుతున్న పనులు పూర్తి చేయాలని పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాగేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని సింగుపురం, పొందూరు మండలం కింతలిలో నిర్వహిస్తున్న డెమో పాఠశాలల 'నాడు-నేడు' పనులను ఆయన పరిశీలించారు. డెమో పాఠశాలలు జిల్లాలోని మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రతిరోజు పనులను పర్యవేక్షించాలని, నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని డీఈవో కె.చంద్రకళ, సమగ్రశిక్షా ఏపీసీ పైడి వెంకటరమణలకు సూచించారు.

ఇందులో ఉపవిద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ, తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరపాలకసంస్థ సమావేశ మందిరంలో నాడు-నేడు పనులపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కమి షనర్ పి.నల్లనయ్య సమీక్షించారు. పనులను నిత్యం పర్యవేక్షించాలని, ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశంలో నగరపాలకసంస్థ ఇంజినీర్ జి.వెంకటి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## కౌన్సిలింగు ప్రక్రియతో జిల్లా పోలీసు-శాఖలో హెచ్‌సిలుకు బదిలీలు

- 54 మంది హెచ్‌సిలుకు కౌన్సిలింగు నిర్వహించి, బదిలీలు చేసిన జిల్లా ఎస్పీ
-ఎటువంటి రాజకీయ సిఫార్సులు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తయిన బదిలీల ప్రక్రియ
- సంతోషాన్ని వ్యక్తం చేసిన పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సభ్యులు



విజయనగరం : విజయనగరం జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుళ్ళుకు జిల్లా ఎస్పీ బి. రాజకుమారి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కౌన్సిలింగు నిర్వహించి, వారు కోరుకున్న చోటుకు బదిలీలు చేసారు. పోలీసు స్టేషనులో ఐదు సం॥లు పూర్తి చేసుకున్న హెచ్‌సిలు మరియు ఇటీవల కాలంలో ఉద్యోగోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్ళుకు జిల్లా ఎస్పీ బి.రాజకుమారి కౌన్సిలింగు నిర్వహించారు. కౌన్సిలింగుకు హాజరైన పోలీసు హెడ్ కానిస్టేబుళ్ళను ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ పిలిచి, వారితో మాట్లాడి, వారి సమస్యలను వింటూ, వాటిని పరిష్కరించే దిశగా వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. వివిధ పోలీసు స్టేషన్లులో ఏర్పడుతున్న ఖాళీలను వివరాలను స్ర్కీన్‌పై చూపుతూ, వారు కోరుకున్న పోలీసు స్టేషనుకు ఎటువంటి రాజకీయ సిఫార్సులు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా బదిలీలు చేయడంతో పోలీసు సిబ్బందిలో హర్షం వ్యక్తమైంది. పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సీనియార్టీకి అత్యధిక ప్రాధాన్యతను జిల్లా ఎస్పీ కల్పించి, వారిని ముందుగా కౌన్సిలింగుకు పిలవడం జరిగింది. కౌన్సిలింగులో పోలీసు సిబ్బంది ఏ రంగంలో ప్రావీణ్యాన్ని కలిగి ఉన్నారో జిల్లా ఎస్పీ తెలుసుకొని, వారికి అవకాశాలను కల్పించారు. అనంతరం, వైద్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరి కొంతమంది హెడ్ కానిస్టేబుళ్ళ రిక్వెస్టులను పరిశీలించి, వారిని కూడా వారు కోరుకున్న చోటుకు జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి బదిలీ చేస్తూ, ఉత్తర్వులు జారీ చేసారు. ఈ కౌన్సిలింగు ప్రక్రియలో ఎస్పీ డిఎస్పీ సి.ఎం.నాయుడు, విజయనగరం డిఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, దిశ మహిళా పిఎస్ డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎఆర్‌డిఎస్పీ ఎల్.శేషాద్రి, ఎస్పీ సిఐలు వి. వెంకటప్పారావు, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు చాముండేశ్వరి పాల్గన్నారు. సంతోషాన్ని వ్యక్తం చేసిన పోలీసు సిబ్బంది మరియు జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎటువంటి సిఫార్సులు లేకుండా జిల్లాలో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి కౌన్సిలింగు నిర్వహించి, వారు కోరుకున్న చోటుకు బదిలీలను జిల్లా ఎస్పీ బి. రాజకుమారి చేయడంతో పోలీసు సిబ్బంది తమ సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేసారు. జిల్లా పోలీసుశాఖలో బదిలీలలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సిఫార్సులు లేకుండా జిల్లా ఎస్పీగారు పోలీసు సిబ్బంది ఇబ్బందులను గ్రహించి, వారు కోరుకున్న స్థానానికి బదిలీ చేయడానికి జిల్లాఎస్పీగారు తీసుకున్న చొరవ పట్ల తమ ఆనందాన్ని అడహక్ కమిటీ సభ్యులు మరియు అడహక్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. శ్రీనివాసరావు వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అసోసియేషన్ తరుపున జిల్లా ఎస్పీ బి.రాజకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

## మానవ మనుగడకు రక్తం ఎంతో అవసరం
### -విశాఖ స్టీల్ ప్లాంట్ ఇ.డి. విద్యాసాగర్



గాజువాక: మానవ మనుగడకు రక్తం ఎంతో అవసరమని విశాఖ స్టీల్ ప్లాంట్ ఇ.డి. (వర్క్స్)విద్యాసాగర్ స్పష్టం చేశారు. శుక్రవారం స్టీల్ గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కునగరం లోని అంబేద్కర్ కళాక్షేత్రం లో రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరం లో సుమారు 250 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టీల్ ప్లాంట్ %జు. ఐ% (వర్క్స్) విద్యాసాగర్ మాట్లాడుతూ మనిషి మనుగడకు రక్తం అత్యంత ముఖ్యమైనదని అన్నారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ మనుగడకు సొంత గనులు కూడా అంతే అవసరం అని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు కోవిడ్ - 19 తో ప్రపంచం అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. అందులో ప్రధానంగా ప్రజల ఆరోగ్యంపై ప్రాధాన్యత పెరిగిందని ఆయన అన్నారు. కనుక రక్తం ద్వారా కొంత మందికైనా ప్రాణాలను కాపాడాలని ముందుకు వచ్చిన స్టీల్ ఉద్యోగులు, కార్మికులు, వారి పిల్లలకు ముందుగా ధన్యవాదములు తెలిపారు. ఇటువంటి మహోన్నతమైన కార్యక్రమంలో నేను కూడా భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో స్టీల్ గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షులు బి. గంగారాం, స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు జె. అయోధ్య రామ్, ప్రధాన కార్యదర్శి వై. టి. దాస్, స్టీల్ ప్లాంట్ జి ఎం. సంజీవరావు, మిత్రపక్షల నాయకులు సిహెచ్. సన్యాసిరావు, రమేష్, డి. వి. రమణారెడ్డి, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు జె. సింహాచలం, బి. అప్పారావు, యు. వెంకటేశ్వర్లు, మరిడయ్య, గంగాధర్, యు. రామస్వామి, నీలకంఠం, తౌడన్న, టి. వి. కె రాజు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షుడు డి. పాండే, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కె. యమ్. శ్రీనివాస్, వి. వి. రమణ, యన్.శే షగిరి, ట్రెజరర్ కె. బాలశౌరి,మంత్రి జగన్నాధరావు సత్యనారాయణ, సంస్థ అధ్యక్షుడు రావు, శ్రీనివాసరావు,తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# అవినీతిని ఎండగట్టినందుకే అచ్చెన్నాయుడుపై కక్ష సాధింపు

## మాజీ ఎమ్మెల్యే కొండబాబు



కాకినాడ : అచ్చెన్ననాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అంబేద్కర్ భవన్ వద్ద పూలే విగ్రహామం నందు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా మహాత్మ జ్యోతి బాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వనమాడి కొండబాబు మాట్లాడుతూ జగన్ అవినీతిని ఎండ గట్టినందుకే అచ్చెన్న నాయుడుపై కక్ష సాధింపు చేస్తున్నారని కుటుంబ సభ్యులకు చెప్పకుండా అచ్చెన్న ఇంటిపై దాడి చేసి చట్ట విరుద్ధంగా అచ్చెం న్నాయుడిని అరెస్ట్ చేశారని వైసీపీ ప్రభుత్వం శాడిజం పరాకాష్టకు చేరిందని, ప్రతిపక్షాన్ని అసెంబ్లీలో ఎదుర్కొలేకే ఇలాంటి దుర్మార్గాలకు తెగించారని, వైసిపి ఏడాది పాలనలో అవి నీతి కుంభకోణాలు ఇసుక, మద్యం, గనులు, భారతీ పాలిమర్స్ నిధులు కేటాయింపు, ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు, భూసేకరణలో స్కాంలు, అసెంబ్లీలో నిగ్గదీస్తారనే భయంతో అక్రమంగా అరెస్టు చేశారని రాజకీయంగా ఎదుర్కొలేక దొడ్డిదారని కక్ష సాధింపు చేపడు తున్నారని ఎర్రంనాయుడి కుటుంబ ప్రతిష్ట దెబ్బతీసేందుకే అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో...

గుత్తుల రమణ, కర్రీ శ్రీనివాస్, తాజుద్దీన్, గదుల సాయిబాబా, వనమాడి ఉమా శంకర్, మల్లాడి గంగాధరం, అంబటి చిన్న, బంగారు సత్య నారాయణ, గుజ్జి బాబు, మల్లిపూడి వీరు, అజ్జు, పలివెల రవి, చింతలపూడి రవి, కొల్లాభక్తుల అప్పారావు, సికోటి అప్పలకొండ, ముగ్గల బాబురావు, బలరాం, పసుపులేటి వెంకటేశ్వరరావు, గదుల వీరబాబు, మేడిశెట్టి చిన్ని, ఇరుపిల్లి రాము,ఖాన్, గుమ్మల చిన్న, గడ్డం పూర్ణ, కలిదిండి సురేష్, కోరుమిల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.

# కరోనా నియంత్రణకు ప్రత్యేక నిఘా: జిల్లా కలెక్టర్ జె.నివాస్



శ్రీకాకుళం : కరోనా నియంత్రణకు ప్రత్యేక నిఘా అవసరమని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో కోవిడ్ 19 ప్రత్యేక అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులంతా సమన్వయంతో పని చేసి కరోనా వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. వలస కార్మికులు అధిక సంఖ్యలో జిల్లాకు వస్తున్న నేపథ్యంలో కరోనా కేసులు పెరిగే అవకాశం వుందన్నారు. ఏ ఒక్కరికి పోజిటివ్ వచ్చినా వారి నుండి మరొకరికి సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు నిమిత్తం , ముఖ్యంగా ఇతర జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. పోజిటివ్ వచ్చిన వ్యక్తి ఫ్లైట్ లో ప్రయాణం చేసి జిల్లాకు చేరుకున్నట్లయితే, అతను మార్గ మధ్యంలో ఏ యే ప్రయాణ సాధనాల ద్వారా ప్రయాణించారో తెలుసుకోవాలన్నారు. ట్రైన్ లో వచ్చినట్లయితే ఆ కంపార్ట్ మెంట్ లో వున్న ప్రయాణీకుల వివరాలను సైతం సేకరించవలసి వుంటుందన్నారు. అదే విధంగా బస్సులలో ప్రయాణించినట్లయితే ఆ వ్యక్తి కూర్చున్న సీటుకు ముందు, వెనుక సీట్లలోని ప్రయాణీకుల వివరాలను కూడా తెలుసుకోవాలన్నారు. పోజిటివ్ వచ్చిన వారి కుటుంబ సభ్యులను సైతం క్వారంటైన్ లో వుంచవలసినదిగా తెలిపారు. గ్రామాలకు వచ్చిన వారు ఎవరెవరిని కలిసారు, ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారా వంటి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ప్రత్యేక అధికారులంతా పేషెంట్ల ఐ.డి.లను కాంటాక్ట్ వివరాలను తీసుకోవాలన్నారు. వారు దగ్గరగా మసలిన వారి సాంపిల్స్ తీయాలన్నారు. హోమ్ క్వారంటైన్ లో వున్నవారిపై నిఘా వుంచాలన్నారు. అధికారులు నిరంతర అప్రమత్తతతో పని చేసి కరోనా వ్యాప్తి నిరోధానికి సహకారంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్,ఐ.టి.డి.ఎ. ప్రాజెక్టు అధికారి సి.హెచ్. శ్రీధర్, సహాయ కలెక్టర్ నవీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.చెంచయ్య, జిజిహెచ్ పర్యవేక్షకులు డా.ఏ.కృష్ణ మూర్తి, డిసిహెచ్ఎస్ బి.సూర్యారావు, సిపిఒ మోహన రావు, జిల్లా పరిషత్ సి.ఇ.ఒ. చక్రధరరావు, విపత్తుల విభాగం ఇన్ ఛార్జి డిఎం బి.నగేష్, ప్రత్యేక అధికారి జి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా.బి.జగన్నాథ రావు, రామ్మోహన్ రావు, కృష్ణ మోహన్, అరుణ కుమారి, డా.కిశోర్, డా.నరేష్, జిల్లా అటవీశాఖాధికారి, కోవిడ్ ప్రత్యేక అధికారి బి.శాంతి, ప్రజా రవాణా శాఖ డిపో మేనేజరు ఎం.ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి 'టెలి స్పందన'

## - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్



విజయనగరం : ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు "టెలి స్పందన" కార్యాక్రమాన్ని తే. 15-06-2020 ది నుండి ప్రతీ సోమవారం నాడు నిర్వహించనున్నట్లు విజయ నగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి, ఐ.పి.ఎస్., తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారి మాట్లాడుతూ – కరోనా వ్యాధి వ్యాప్తి కారణంగా ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంను తాత్కా లికంగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ, ప్రజలు సోమవారం నాడు ఫిర్యాదు చేసేందుకుగాను ఎస్పీ కార్యాలయంకు వస్తున్నారన్నారు. ఇకపై ప్రజలెవ్వరూ సోమవారం నాడు ఎస్పీ కార్యాలయానికి రానవసరం లేదని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకుగాను ఇకపైప్రతీ సోమవారం ఉదయం 10-30 గం။ల నుండి మద్యాహ్నం 1-00 గం॥ వరకు "టెలీ స్పందన" నిర్వహిస్తా మన్నారు. కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్న కారణంగాను, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, టెలి స్పందన కార్యమ్రాన్నినిర్వహించి, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. టెలి స్పందనలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించేందుకు అదేరోజున సంబంధిత అధికారులకు ఫిర్యాదులను పంపుతామన్నారు. కావున, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించు కోవాలని, శ్రమపడి జిల్లా పోలీసు కార్యా లయానికి రావద్దని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలను కొనే వారు ఇకపై ప్రతీ సోమవారం ఉదయం 10-30 గం॥ల నుండి మద్యాహ్నం 1-00 గం॥ల మధ్య 08922-276163కు ఫోను చేసి, తమ సమస్యను తెలపవచ్చునని, ఫిర్యాదు చెయ్యవచ్చునని జిల్లా ఎస్పీతెలిపారు. బాధితుల సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారు లకు ఆదేశాలిచ్చి, సమస్య పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి. రాజకుమారి తెలిపారు.

# మాజీ మంత్రి అచ్చెన్నాయుడు అరెస్ట్ ప్రజాస్వామ్యంనకు విరుద్ధం

## టీడీపీ 50వ వార్డు అభ్యర్థి సనపల వరప్రసాద్



మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో ప్రతి పక్ష తెలుగుదేశం పార్టీ ఉప నాయకుడు కింజరాపు. అచ్చెనాయుడును శుక్రవారం ఉదయం 100 మంది పోలీస్ బలగాలతో అక్రమ అరెస్టు చెయ్యడం అప్రజాస్వామ్యమని నిరసనగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం 50వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో బిర్లా జంక్షన్ వద్ద జాతీయ రహదారి పైన అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించడము జరిగింది.ఈ సందర్భంగా సనపల వరప్రసాద్ మాట్లాడుతూ

మాజీ మంత్రి అచ్చెనాయుడు అరెస్ట్ అప్రజా స్వామ్యమని, రాష్ట్రములో దుర్మార్గపు పాలన జరుగుతుందని,రాష్ట్రంలో 16వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో అసెంబ్లీలో వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీస్తాడనే భయంతో నేడు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా,సర్జరీ చేయుంచుకొని విశ్రాంతి తీసుకుంటున్న అచ్చెంనాయుడుని అరెస్టు చేయడము దుర్మార్గమని, రాష్ట్రములో ఏ ప్రభుత్వం హయంలో కూడా ముందస్తు నోటీసు ఇవ్వకుండా అరెస్టులు జరగలేదని,కానీ మన రాష్ట్రములో వైసీపీ హయంలో రాజ్యాంగానికి విరుద్ధంగా,నియంత పాలన జరుగుతుందని, గత సంవత్సర కాలంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై గెట్టిగా పోరాడుతున్నారని

శాసనసభా పక్ష ఉప నేతగా ఉన్న అచ్చెన్నాయుడికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్టు చేయడం చట్టాన్ని ఉల్లంఘించడం కాక మరేమిటి? అని బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 34% నుండి 24% తగ్గించారు. బీసీ సబ్ ప్లాన్ నిధులు డ్రైవ్ చేసారు, ముఖ్యమైన నామినేషన్ పదవులు బీసీలకు మొండిచేయి చూపి సంక్షేమ పథకాల్లో కోతలు విధించారు.వీటినన్నిటిని శాసనసభ వేదికగాను ఇతరాత్రా వేదికల ద్వారా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజలకు తెలియజేసినందుకు వల్ల దానిని సహించలేక జగన్ చట్టవ్యతిరేకంగా అరెస్టు చేశారన్నారు. అచ్చెనాయుడుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కక్ష గట్టి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించారాని,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరు వెలెత్తి చూపినా ప్రభుత్వం వారిని ఏదో ఒక రకంగా వేదిస్తున్నారని అచ్చెనాయుడు పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అన్యాయం అని రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అనేది లేకుండా పోయిందని,కోర్టులు ఎన్ని సార్లు మందలించినా ముఖ్యమంత్రి కి చీమ కుట్టినట్లయినా లేదని, బిసి నాయకుడు అచ్చెనాయుడుని అరెస్టు చేసి బిసి నాయకత్వంను అనగ త్రొక్కలని అచ్చెనాయుడుని అరెస్ట్ దుర్మార్గమని ఖండించి సనపల.వరప్రసాద్ అతని ఇంటి వద్ద కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో సనపల.అప్పలస్వామి (బొజ్జన్న),సనపల.రామచంద్రరావు,సనపల.సత్యనారా యణ,ఎండా.ధాత్రి,ఎండా. మాధవ స్వామి, నాగన్న, తెలుగుదేశం పార్టీ వార్డు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహెూమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హెూమము ఘనంగా నిర్వహించారు.ఉదయం 9 గం.లకు పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహ వచనం, అమ్మవారికి మూల,మంత్ర జప ములు, సప్తపతి పారాయ ణములు నిర్వహించారు.11 గం.లకు పూర్ణహుతి గావిం చారు.పూజా కార్యక్రమాలను చెళ్ళపిళ్ళ ప్రసాద్ శర్మ, కూచిబొ ట్ల.ప్రసాద్, ముత్య వెంకట్రావు మరియు వేదపండి తులు, అర్చకులు నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో ఈవో త్రినాధ రావు, ట్రస్ట్ బోర్డు మెంబర్ బదిరెడ్డి.ఆశాలత దంప తులు,ఏఈవో ప్రసాద్, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్,లక్ష్మణ స్వామి మరియు ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం తీర్థ, ప్రసాదములు అందజేశారు.

# 98వ వార్డులో ఘనంగా అవంతి జన్మదిన వేడుకలు

## పేదలకు నిత్యావసరాలు పంపిణీ





సింహాచలం: జీవీఎంసీ 98 వ వార్డు లో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకొని పేదలకు తొలి పావ్వంచ వద్ద చీరలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఆకులు నాగరాజు ఆర్థిక సహాయం తో జరిగిన ఈ కార్యక్రమం తో పాటు మనసు అనాథాశ్రమంలో చిన్నారులకు నిత్యావసర సరు కులు బంగారుతల్లి వృద్ధాశ్రమంలో సీలింగ్ ఫ్యాన్ పంపిణీ చేశారు అనంతరం స్థానిక కళ్యాణమండపంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కొలుసు ఈశ్వరరావు ఎర్రవరం బాబు పీతల అప్పలరాజు బొట్ట శ్రీనివాసరావు ఆకుల నాగరాజు గంటల కిరణ్ దొంతుల సంతోష్ ఆనంద శ్రీనివాస్ వర్మ లంక సత్తిబాబు, సిరిపురపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఈబి దాడులు

## - స్పెషల్ ఎన్ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు



విజయనగరం : స్పెషల్ ఎన్ఫోర్సుమెంటు బ్యూరో ఆధ్వర్యంలో జిల్లాలో చీపురుపల్లి, సాలూరు, పార్వతీపురం రూరల్, బుదరాయ వలస, జామి, పోలీసు స్టేషన్లు పరిధిలో దాడులు నిర్వహించి 190 టన్నుల ఇసుక అక్రమ నిల్వలు, 236 లీటర్ల నాటు సారా, 22 క్వార్టరు బాటిల్లు మద్యం అక్రమ నిల్వలు పట్టుకొన్నట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు శుక్రవారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎసీ బి.రాజకుమారి ఆదేశాలతో ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఎస్.ఈ.బి సిబ్బందితో దాడులు నిర్వహించి నట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు. చీపురుపల్లి పి.ఎస్ పరిధిలో 190 టన్నుల ఇసుక అక్రమ నిల్వలు స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదపు లోనికి తీసుకొని, కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. సాలూరు రూరల్ పి.ఎస్ పరిధిలో బట్టివలస, మామిడిపల్లి, దండిగాం గ్రామాల వద్ద 136 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకొని 7గురు వ్యక్తులను అదపులోనికి తీసుకొని, కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. పాచిపెంట పి.ఎస్ పరిధిలో 80 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.

పార్వతీపురం రూరల్ పి.ఎస్ పరిధిలో 20 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.

బుదరాయవలస పి.ఎస్ పరిధిలో, మెరకముడిదాం గ్రామంలో 15 క్వార్టరు బాటిల్లు మద్యం ఒక వ్యక్తి నుండి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు జామి పి.ఎస్ పరిధిలో 07 క్వార్టరు బాటిల్లు మద్యం ఒక వ్యక్తి నుండి స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు.

ఈ దాడుల్లో ఎస్ఈబి అధికారులు, సిబ్బంది మరియు స్థానిక పోలీసులు, పాల్గన్నారని ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

# అన్నవరం దేవస్థానం ఈవో కు కరోనా పరీక్షలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కరోనా వైరస్ నివారణలో భాగంగా 82 రోజుల తరువాత లాక్ డౌన్ సడలింపుతో రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు అన్నీ తెరుచుకున్నాయి.దీనితో అన్నవరం శ్రీ సత్యదేవుని ఆలయానికి నూతన వధూవరులులతో మరియు భక్తులతో రత్నగిరి అంతా సందడిగా ఉండటంతో పాటు భక్తులు వివిధ ప్రాంతాల నుండి వస్తుండడం వలన కరోనా వైరస్ ప్రభావంతో ముందస్తు చర్యగా సత్యదేవుని ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరికీ కవిడ్-19 పరీక్షలు రోజుకు 50 మందికి చేపట్టానున్నారు.

ఇందులో భాగంగా గురువారం దేవస్థానం ఈవో వి.త్రినాధరావు తో సహా మొత్తం 50 మందికి వైద్యాధికారులు కోవిద్-19 శ్వాబ్ పరీక్షలు నిర్వహించారు.

# జగన్న చేదోడు పథకం క్రింద రూ.10,000 రూపాయలు ఆర్థిక సాయం



విశాఖపట్నం : కలెక్టర్ అదేశాలమేరకు జగనన్న చేదోడు పథకం న కు అర్హత పొందిన లబ్దిదారుల కు జీవీఎంసీ జోన్ 3 వార్డ్ 24 సచివాలయం చిన్నఅమ్మవారి స్ట్రీట్ లో జగన్న చేదోడు పథకం క్రింద 10000 రూపాయలు ఆర్థిక సాయం పొందిన లబ్ది దారులకు వార్డ్ పరిపాలన అధికారి పీ జె గణేష్ కుమార్ చేతులమీదుగా మంజూరు పత్రాలు అందజేయడం జరిగింది.

కుల వృత్తులు వారికి 10 వేల రూపాయలు జమ చేయటం ఎంతో ఆనందదాయకం అని అర్హులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీలు,జోష్నా నాగేశ్వర రావు, రోహిత్ పాల్గొన్నారు

